## రికార్డ్ స్థాయిలో విద్యుత్ డిమాండ్..

హైదరాబాద్,తెలంగాణలో విద్యుత్ డిమాండ్ రికార్డుస్థాయిలో పెరగడంతో 16000 మెగావాట్ల మైలురాయిని అధిగమించింది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలతో సరఫరా పరిస్థితిని సమీక్షించారు.తెలంగాణ రాష్ట్రంలో 2025 ఫిబ్రవరి 19 ఉదయం 7 గంటల 55 నిమిషాలకు 16058 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఇదే నెల 10వ తేదీన 15998 మెగావాట్లు నమోదు కాగా తాజా డిమాండ్ ఆ రికార్డును అధిగమించింది. గత ఏడాది మార్చి 8న 15623 మెగావాట్లు నమోదైన రికార్డును కూడా ఈ ఏడాది ఫిబ్రవరి 5నే అధిగమించారు.విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నప్పటికీ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు ఎలాంటి సమస్యలు లేకుండా దీటుగా ఎదుర్కొంటున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఏంతటి డిమాండ్ వచ్చినా సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. తెలంగాణ ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉంది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :308 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 20-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## యూట్యూబ్ ల కట్టడికి సుప్రీంకోర్టు కీలక నిర్ణయం



న్యూఢిల్లీ,ఈ కాలంలో జర్నలిస్ట్ అంటే అర్థం మారిపోయింది. ప్రఖ్యాత తెలుగు పత్రికల జర్నలిజం స్కూళ్ల పరీక్ష పాస్ అయ్యి ఆరు నెలల నుంచి ఏడాది ట్రైనింగ్ తీసుకొని డెస్క్ లలో, ఫీల్డ్ మీద పనిచేసి వచ్చేవారే జర్నలిస్టులు అనుకుంటే పొరపాటే.. ఎందుకంటే ఒక మైక్, వీడియో ఉంటే చాలు యూట్యూబ్ చానెల్ మొదలుపెట్టి విశ్లేషణలు చెబితే పెద్ద జర్నలిస్ట్ అయిపోతారు. రాత్రికి రాత్రే జర్నలిజం బ్యాక్ గ్రౌండ్ లేకుండా మాస్ జర్నలిస్ట్ అయిపోతారు. ప్రస్తుత సోషల్ మీడియా విచ్చలవిడి తనంపై సామాన్యులు, రాజకీయ పార్టీలే కాదు సుప్రీం కోర్టు కూడా తాజాగా ఆందోళన వ్యక్తం చేసింది.ఆన్లైన్ వేదికల నియంత్రణకు చట్టంలో స్పష్టత లేకపోవడం వల్ల యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్లు దీనిని తమ అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారని సుప్రీంకోర్టు మంగళవారం అభిప్రాయపడింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, "యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న అనేక కార్యక్రమాల్లో సముచిత నియంత్రణ లేకుండా అన్నీ చెల్లుబాటవుతున్నాయి. దీనిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మేము చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేసింది.ప్రముఖ పాడ్‌కాస్టర్ రణవీర్ అల్హాబాదియా కేసును ప్రస్తావిస్తూ, భారతీయ కుటుంబ వ్యవస్థను కించపరిచేలా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమైనవని కోర్టు అభిప్రాయపడింది. "ఈ కేసులో మేము ఇప్పటికే అతనికి నోటీసు జారీ చేశాం. ఇది అత్యంత సున్నితమైన విషయం, దీన్ని నిర్లక్ష్యం చేయలేం" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.కోర్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఆర్.వెంకటరమణిలను ఈ కేసు తదుపరి విచారణలో సహాయం అందించాల్సిందిగా కోరింది. కేంద్ర ప్రభుత్వం సహకరించాలన్న కోర్టు, యూట్యూబ్ వంటి డిజిటల్ వేదికల నియంత్రణలో ఉన్న లోపాలు ఆందోళన కలిగిస్తున్నాయని వ్యాఖ్యానించింది.అంతకు ముందు కోర్టు, రణవీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "అతని మాటల్లో అశ్లీల భావజాలం కనిపించింది.. ఈ ఆలోచనలను యూట్యూబ్ షో ద్వారా బహిర్గతం చేశారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.మొత్తం గా కుటుంబ వ్యవస్థపై నీచంగా కామెంట్స్ చేసిన యూట్యూబర్ పై ఇంటా బయటా విమర్శలు వచ్చాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా ఈ మాధ్యమంపై సీరియస్ గా దృష్టి సారించినట్టు అర్థమవుతోంది.

## అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడిగా గౌరవ్ గొగోయ్..



అస్సాం: వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న ఈశాన్య రాష్ట్రం అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడిగా లోక్‌సభ సభ్యుడు గౌరవ్ గొగోయ్‌ను నియమించాలని కోరుతూ ఆ పార్టీ సీనియర్ నాయకుల బృందం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు లేఖ రాసింది.ఇదే విషయాన్ని ఇప్పటికే సోనియా, రాహుల్ గాంధీలతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు కూడా తెలియజేశారు. దీంతో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు సరైన సమాధానం చెప్పేది గొగోయ్ మాత్రమే అని పార్టీ శ్రేణులు సైతం భావిస్తున్నారు. కాగా, ఇటీవల గొగోయ్ భార్యకు పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయని సీఎం బిశ్వ శర్మ ఆరోపించగా.. అతడి వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గొగోయ్ హెచ్చరించాడు.కాగా, తక్షణమే గౌరవ్ గొగోయ్‌ను అస్సాం కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని పార్టీ సీనియర్ నేతలు డిమాండ్ చేశారు. ఈ నిర్ణయంతో అస్సాం ప్రజలతో కనెక్ట్ అవ్వడంలో కాంగ్రెస్ గణనీయమైన పురోగతి సాధించడానికి ఎంతో సహాయ పడుతుందన్నారు. రాష్ట్రంలో కీలకమైన సామాజిక వర్గాల్లో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉందని వారు చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది అస్సాంలో జరిగే ఎన్నికలకు ముందు పార్టీలో ఐక్యతా భావాన్ని పెంపొందించడంలో గొగోయ్ ఎంపిక ఎంతో సహాయపడతాయని కాంగ్రెస్ హైకమాండ్ ముందు వెల్లడించారు.ఇక, అస్సాం పీసీసీ అధ్యక్షుడిగా బూపన్ కుమార్ బోరా దాదాపు నాలుగేళ్ల పదవీని సైతం పూర్తి చేసుకున్నారు. అయితే, లోక్‌సభలో ప్రస్తుతం కాంగ్రెస్ డిప్యూటీ లీడర్, సీబ్ల్యూసీ సభ్యుడిగా ఉన్న గౌవర్ గొగోయ్.. ఎల్ఓపీ నేత రాహుల్ గాంధీతో మంచి సాన్నిహిత్యం ఉంది. దీంతో గొగోయ్ ను అస్సాం రాష్ట్ర పీసీసీ చీఫ్ గా నియమించడానికి సైతం ఏఐసీసీ పెద్దలు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే, గత కొంతకాలంగా హిమంత బిశ్వశర్మ– గొగోయ్‌ల మధ్య జరిగిన వివాదంలో.. రాహుల్ గాంధీ తర్వాత శర్మకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది గొగోయ్ మాత్రమే అని చెప్పొచ్చు.

## ఓట్ల కోసం దేశాన్ని విడగొట్టే పార్టీ బీజేపీ...



సూర్యాపేట:సూర్యాపేట జిల్లా దురాజ్ పల్లిలో జరుగుతున్న లింగమంతుల జాతరలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం సెక్యూలర్ విధానాన్ని పాటిస్తుందని, అన్ని మతాలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. మాది సెక్యూలర్ ప్రభుత్వమని, మాకు అన్ని పండుగలు సమానమేనని అన్నారు. ప్రజలందరికీ సమాన న్యాయం అందించడమే మా ధ్యేయం అని తెలిపారు.బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన ఆయన, ఓట్ల కోసం దేశాన్ని విడగొట్టే పార్టీ బీజేపీ.. వాళ్లకు మా గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. అలాగే, తెలంగాణలో కాంగ్రెస్ పాలన మరింత బలోపేతం అవుతుందని, వచ్చే 20 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే బీసీని సీఎం చేస్తామని చెప్పిన బీజేపీ, ఓ బీసీ నేత పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా అతన్ని పక్కన పెట్టిందని చెప్పుకొచ్చారు. వాళ్ల నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. దళితుడిని సీఎం చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలు, ఇప్పుడు వాస్తవాన్ని అర్థం చేసుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి రాకతో దురాజ్ పల్లి లింగమంతుల జాతర వైభవంగా సాగుతోంది.

## మహాయుతి కూటమిలో విభేదాలు.. ఏక్‌నాథ్ షిండే ఏమన్నారంటే..?



ముంబై: మహారాష్ట్ర రాజకీయాలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ (దేవేంద్ర ఫడ్నవీస్) ఆపని మహాయుతి (మహాయుతి) కూటమిలో చీలికలు వస్తున్నట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన షిండే వర్గానికి బీజేపీకి మధ్య విభేదాలు తలెత్తినట్లు రాజకీయ వర్గాలు కనిపిస్తున్నాయి. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మధ్య ప్రచ్ఛన్నయుద్ధం నడుస్తోంది మహారాష్ట్రలో తీవ్రంగా చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రత్యక్ష ఏక్‌నాథ్ షిండే (ఏక్‌నాథ్ షిండే) ఇటీవలే ప్రత్యేకంగా ఓ వైద్య సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలపై డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు. దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎలాంటి తగాదాలూ లేవని స్పష్టం చేశారు.'మా మధ్య ఎటువంటి ప్రచ్ఛన్న యుద్ధం లేదు (కోల్డ్ వార్). అభివృద్ధిని వ్యతిరేకించే వారిపై మేము ఐక్యంగా పోరాటం చేస్తాం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 31 అక్టోబర్ 2023న అప్పటి ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ఇలాంటి ఓ సెల్ను స్థాపించారు. తమ ప్రాంత ప్రజల కోసం దాని కార్యకలాపాలను పర్యవేక్షించే నా వ్యక్తులతో నేను ఓ కేంద్రాన్ని పునర్నిర్మించాను' అని షిండే స్పష్టం చేశారు. మరోవైపు ఈ వివాదంపై సీఎం ఫడ్నవీస్ కూడా స్పందించారు. 'సచివాలయంలో ఏక్‌నాథ్ షిండే ఓ వైద్య సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో తప్పేమీ లేదు. నేను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అటువంటి సెల్‌ను ఏర్పాటు చేశాను. ప్రజలకు సహాయం చేయడమే లక్ష్యం. కాబట్టి అలాంటి సెల్‌ను సచివాలయంలో ఏక్‌నాథ్ షిండే ఏర్పాటు చేశారు' అని పేర్కొన్నారు.కాగా, వైద్య సహాయ కేంద్రం ఏర్పాటుతోపాటు.. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే (ఏక్‌నాథ్ షిండే) శివసేనకు చెందిన కొందరు ఎమ్మెల్యేలకు వీఐపీ భద్రతను ప్రభుత్వం తొలగించడంతో మహాయుతి కూటమిలో విభజనలు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం హోంశాఖ సీఎం ఫడ్నవీస్ వద్దే ఉంది. ఈ నేపథ్యంలో షిండే వర్గానికి చెందిన 20 మంది ఎమ్మెల్యేలకు (శివసేన ఎమ్మెల్యేలు) ఉన్న వై కేటగిరి (వై కేటగిరీ భద్రత) సెక్యూరిటీని హోం శాఖ ఉపసంహరించుకుంది. బీజేపీ, అజిత్ పవార్ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు కల్పించిన భద్రతను కూడా తగ్గించింది. అయితే, షిండే వర్గంతో ఆ సంఖ్య చాలా తక్కువ అని తెలిసింది. రాష్ట్ర వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ రెండు అంశాలూ రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారాయి.

## మిఠాయిలు పంచితే సస్పెండ్ చేయరా కేటీఆర్?



హైదరాబాద్,ఉద్యోగి తన ఉద్యోగాన్ని చేసుకుంటూ పోతే సరి. వ్యక్తిగత అభిరుచుల్ని ప్రదర్శించటం అంత మంచిది కాదు. అందులోనూ రాజకీయ అంశాలకు సంబంధించి మరింత అప్రమత్తంగా ఉండాలి. ఈ విషయంలో చేసే పొరపాట్లకు భారీగా మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా స్కూల్లో ప్రిన్సిపల్ మిఠాయిలు పంచటం తప్పా? అని ప్రశ్నిస్తున్నారు మాజీ మంత్రి కేటీఆర్.హైదరాబాద్ మహానగర శివారు పరిధిలోని ఒక పాఠశాలలో ప్రిన్సిపల్.. విద్యార్థులకు కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మిఠాయిలు పంచటంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై కేటీఆర్ మండిపడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి పుట్టినరోజు నాడు స్కూల్లో మిఠాయిలు పంచితే తప్పా? అని ప్రశ్నిస్తున్నారు. 14 ఏళ్ల పాటు అహింసాయుత పోరాటం చేసి.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి.. తెలంగాణ ఆత్మగౌరవాన్నినిలబెట్టిన కేసీఆర్ పుట్టిన రోజున విద్యార్థులకు మిఠాయిలు పంచితే తప్పా? అని ప్రశ్నిస్తూ.. సీఎం రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డికి వస్తే మాత్రం స్కూల్లో ఆయనకు పూలు చల్లి.. విద్యార్థుల చేత సెల్యూట్ చేయిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.పదేళ్లు ప్రభుత్వాన్నినడిపిన కేటీఆర్ లాంటి వాళ్లకు ఏ విషయంలో ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దానికి సంబంధించిన అవగాహన ఎక్కువే ఉంది. అదే సమయంలో.. ఇప్పుడున్న కాలంలో ఎవరికి ఏమీ చెప్పాల్సిన అవసరం లేదు. మంచి చెడుల గురించి అవగాహన ఉంది. ఒకవేళ కేటీఆర్ చెప్పినట్లుగా.. స్కూల్లో కేసీఆర్ పుట్టినరోజున విద్యార్థులకు మిఠాయిలు పంచే కార్యక్రమాన్ని చేపడితే ఏమీ అనకూడదు.. స్వాగతించాలన్నట్లుగా చెబుతున్నారు. భవిష్యత్తులో కేసీఆర్ సర్కారు మళ్లీ వచ్చి.. ఐదేళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ పుట్టిన రోజును ఏదైనా స్కూల్లోనో.. కాలేజీలోనో వేడుక నిర్వహించినా? మిఠాయిలు పంచి పెడితే ఇదే కేటీఆర్ అప్పుడు స్వాగిస్తారా? చూస్తూ ఊరుకుంటారా? లాంటి ప్రశ్నలు వేసుకుంటే అసలు విషయం ఇట్టే అర్థమవుతుంది.ఇక్కడ చెప్పేదేమంటే.. ఇలాంటి విషయాల మీద తరచూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడటం వల్ల కేటీఆర్ కు ఇమేజ్ పెరగటం తర్వాత.. డ్యామేజ్ ఎక్కువ అవుతుందన్న విషయాన్ని ఆయన గుర్తిస్తే మంచిది. ఆ మాటకు వస్తే.. కొన్నిరోజుల పాటు ఏ అంశం మీదా స్పందించకుండా మౌనంగా ఉంటే మంచిదన్న అభిప్రాయం వ్యక్తవుతోంది. ఆ దిశగా కేటీఆర్ ఆలోచిస్తే కాస్త బాగుంటుంది. ఏమంటారు?

## మిర్చి రైతులతో జగన్ మమేకం...



గుంటూరు, గిట్టుబాటు ధర లభించక మిర్చి రైతులు విలవిల్లాడి పోతున్నారని, కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అన్ని విధాలా విఫలమైందని వైఎస్సార్సీపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించక అయిన కాడికి అమ్ముకొని నష్టాల పాలవుతున్నారని, కనీసం ఈ జిల్లాలో యార్డుకు కూతవేటు దూరంలో ఉన్న సీఎం చంద్రబాబుకు వారి కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇంటికి సచివాలయానికి వెళ్తున్నారే కానీ రైతుల కష్టాల గురించి ఆలోచించడం లేదని ఆరోపించారు. గత కొద్ది రోజులుగా మిర్చి ధరలు పతనమై రైతులు గగ్గోలు పెడుతుంటే వారి ఆవేదన ఆయన చెవికి చేరడం లేదా అని జగన్ నిలదీశారు.మిర్చి యార్డుకు వస్తున్నారన్న సమాచారంతో వైసిపి శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ దశలో గుంటూరు –చిలకలూరిపేట ప్రధాన రహదారిపై సుమారు గంటపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. భారీగా తరలివచ్చిన వైసీపీ శ్రేణులు జగన్ ను కలిసేందుకు పోటీపడ్డారు. ఒక దశలో ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నందున అనుమతి ఇస్తారా లేదా అన్న సందేహం కలిగింది. అయితే మాజీ సీఎం జగన్ యాడ్ ను సందర్శించేందుకు ప్రభుత్వము ఎటువంటి ఆటంకాలు సృష్టించలేదు.ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మీడియాతో మాట్లాడుతూ కూటమి సర్కార్ రైతులను దగా చేసిందన్నారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలైనా రైతులకు భరోసా ఇవ్వలేకపోయింది అన్నారు. కనీసం గిట్టుబాటు ధర కల్పించకపోగా ఖరీఫ్లో వారికి అందాల్సిన పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేకపోయిందన్నారు. తమ ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను అన్ని విధాల ఆదుకోవడంతోపాటు వారికి అవసరమైన విత్తనాలు ఎరువులు పురుగుమందులు దిగుబడి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల కష్టాలు కనిపించడం లేదని వారి బాధల పట్ల కనీస కనికరం లేదన్నారు. ఆరుగాలము శ్రమించి పంటలను సాగు చేసి ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మార్కెట్ కమిటీలకు వస్తే వారి ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి పట్ల దారుణంగా వ్యవహరిస్తుందన్నారు.రైతుల పట్ల కూటమి సర్కార్ వ్యవహరిస్తున్న తీరును మాజీ సీఎం జగన్ ఎండగట్టారు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు సూచించారు. ప్రతిపక్షం పై చంద్రబాబుకున్న కక్ష సాధింపు చర్యలు రైతులకు మేలు చేయడంలో లేదని విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతో వైసిపి శ్రేణులను ఇబ్బంది పెట్టాలని చూస్తే మరింత ఉత్సాహంతో ముందుకు పోతారని హెచ్చరించారు. ఎల్లకాలము ప్రభుత్వము ఇదే ఉండదని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎవ్వరిని వదిలిపెట్టబోమని అణా పైసా తో సహా తీర్చుకుంటామని గుర్తు చేశారు. తనను మిర్చి యార్డు సందర్శించకుండా అడ్డంకులు సృష్టించారని కనీసము ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన భద్రత కూడా కల్పించలేకపోయారని ఆరోపించారు. ఇవన్నీ తాము గుర్తుపెట్టుకుంటామని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి చేయాలో తమకు తెలుసని జగన్ హెచ్చరించారు.మిర్చి యార్డులో రైతులను స్వయంగా కలిసి ధరల గురించి ఆరా తీశారు. రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని జగన్ ఎదుట వాపోయారు. గతంలో మేలు రకం మిర్చి వెంట 18000 నుంచి 20 వేల వరకు కొనుగోలు చేసేవారని ప్రస్తుతము పదివేలకు కూడా కొనే పరిస్థితి లేదని రైతులు తమ కష్టాలను జగన్ ఎదుట వెలిబుచ్చారు. యార్డులో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మరికొందరు రైతులు జగన్ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు సీజన్లో మధ్యాహ్నం భోజనం కూడా సరిగా కొనసాగించాకపోతున్నారని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి ఘాటు భరిస్తూ రైతులతో సుమారు అర్ధగంట పాటు జగన్ ముఖాముఖి నిర్వహించి వారి కష్టాలను తెలుసుకున్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

కోటగిరి : విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని, మెనూ ప్రకారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కళాశాలలోని వంటగదిని. కూరగాయలను, సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయా అని కళాశాల ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు.

## అంగరంగ వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపన కోసం భూమి పూజ



మహబూబ్ నగర్: జిల్లా కేంద్రంలోని సింహగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా ప్రతిష్టించనున్న శ్రీ గరుత్మంతుడు, శ్రీ ఆంజనేయ స్వామి, సుధామూర్తుల విగ్రహాల కోసం భూమి పూజ నిర్వహించారు. పాలమూరును దుష్టశక్తుల నుంచి సింహగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఎల్లవేళలా కాపాడుతూ.. ఈ నగరాన్ని ప్రశాంతంగా ఉంచుతారని ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఎమ్మెల్యే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ గరుత్మంతుడు సుదామూర్తుల విగ్రహాలను ఇక్కడ అంగరంగ వైభవంగా ప్రతిష్టించుకోవడం జరుగుతుందన్నారు. మహబూబ్ నగర్ పట్టణం ఇప్పుడు ఎంతో ప్రశాంతంగా ఉందని.. ఈ ప్రశాంతతను ఇలాగే ఆ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కాపాడుతారని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి సుందరీకరణ కమిటీ అధ్యక్షులు పోల శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ


## సంపాదకీయం

గురువారం 20-02-2025

# నివురుగప్పిన అవినీతి నిప్పు !

మంత్రులు కమిషన్లు లేనిదే పనిచేయడం లేదన్న బిజెపి ఆరోపణలు..ఇప్పుడు కాంగ్రెస్ పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. ప్రతి పనికి 10 నుంచి 15 శాతం కమిషన్ ముట్టచెప్పుకోవాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందని అంటున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి ఈటెల రాజేందర్ తదితరులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇది నిజమా అని ఆలోచించే సమయం ఆసన్నమయ్యింది. కెసిఆర్ ప్రభుత్వ అవినీతి గురించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం కూడా నిధుల కోసం తెలంగాణపై ఆధారపడుతోందన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలను సంతృప్తి పరిచేందుకు ఇక్కడ కమిషన్ల కక్కుర్తి మొదలయ్యిందన్న ఆరోపణలు నిజంగానే బాధ కలిగించేవిగా ఉన్నాయి. ఓ రకంగా విపక్ష బిఆర్ఎస్‌కు ఇది అందివచ్చిన అస్త్రం. ఏమాత్రం సమాచారం దొరికినా పట్టుకుని ఏకిపారేసేందుకు వారు సిద్దంగా ఉన్నారు. ఇకపోతే బిల్లులు మంజూరుకు ఓ మంత్రి భార్య నేరుగా కమిషన్లు డిమాండ్ చేస్తోందని కూడా అక్కడా ఇక్కడా గ్రామాల్లో కూడా జనం చర్చించు కుంటున్నారు. బిఆర్ఎస్ అవినీతిపై పోరాడుతున్న కాంగ్రెస్ తానే ఈ బురదలో కూరుకుంటే ఇక చేసేదేమీ లేదు. అలాగే కేంద్రానికి కప్పం కట్టేందుకు అవినీతి కూపంలో దిగితే ప్రజలు గమనిస్తూనే ఉంటారు. బిఆర్ఎస్ ఇలా చేసే మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు బిఆర్ఎస్‌ను అవినీతి పార్టీగా ముద్రవేసి పాలన చేస్తున్న కాంగ్రెస్ కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా ..అని సామెత ఉంది. చేసిన తప్పులన్నీ చేసి..ఇప్పుడు కాంగ్రెస్ మీదపడి ఏడుస్తున్నారని ఇంతకాలం బిఆర్ఎస్ ను విమర్శించి, మనం కూడా అదే ఊబిలో దిగితే కాంగ్రెస్ పార్టీని కూడా ప్రజలు నమ్మరు. ఇంతకాలం బిఆర్ఎస్ పదేళ్ల పాపాల గురించి మాట్లాడారు. ఇప్పుడిక కాంగ్రెస్ అవినీతి గురించి చర్చ మొదలయితే ఆ పార్టీని కాపాడడం కష్టమే. ఎందుకంటే మంత్రులపై సిఎం రేవంత్‌కు పట్టు లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిప్పులేనిదే పొగరాదు. బిజెపి చేసిన ఆరోపణలను రేపు బిఆర్ఎస్ చేస్తుంది. అలాగని కాంగ్రెస్ మడిగట్టుకుని కూర్చున్న పార్టీ కాదు. అవినీతిలో ఆరితేరిన చేయి దానిది. ఇంతకాలం తమ పాలనలో అవినీతి వ్యవహారాల గురించి సమాధానం చెప్పడం లేదని ప్రజలు బిఆర్ఎస్‌ను నిందిస్తున్నారు. వారి పాలనలో మల్లన్నసాగర్ రైతులు తిరగబడితే ఎందుకు కేసులు పెట్టారో చెప్పాలని, ఖమ్మం జిల్లాలో రైతులపై ఎందుకు కాల్పులు జరిపారో..ఎందుకు బేడీలు వేశారో చెప్పారని అడుగుతూ వచ్చారు. కాళేశ్వరం అవినీతిపైనా మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలో రైతులను రెచ్చగొట్టిన ఘటనకు సమాధానం చెప్పాలని అన్నారు నిజానికి ఫార్మా కంపెనీల సృష్ట ప్రదాత కెటిఆర్. దానిని ఎవరూ కాదనలేరు. రైతుల భూములను అడ్డంగా లాక్కుని వ్యాపారం చేయడం ఎవరు చేసినా నిలదీయాల్సిందే. కానీ బిఆర్ఎస్ కాదు. అది ప్రజలకు వదిలేయాలి. అవినీతి నేతలు నీతులు వల్లించడం సరికాదు. ఎందుకంటే బిఆర్ఎస్ గురించి చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా అవినీతి కథలు ఉన్నాయి. కానీ ఎదురుదాడి చేయడం, గగ్గోలు పెట్టడం ద్వారా ఎంతోకాలం నమ్మించలేరు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందని అంటున్నారు. నిజంగానే అవినీతి జరిగితే బయటకు లాగాల్సిందే. రేవంత్ అయినా, రాహుల్ అయినా అవినీతి వ్యయహారంఆలపై చర్చ చేయాల్సిందే. కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదస్ మున్సీ కూడా వాటాల కోసం డిమాండ్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవన్నీ ఆరోపణలే కావచ్చు. కానీ నిజం బయటపడితే భగ్గున మండుతుంది. అవినీతిపై చర్చలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి నేతలు ఎవరున్నా వదిలిపెట్టకుండా రచ్చబండ ఏర్పాటు చేస్తే మంచిది. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఆ తర్వాత పార్టీలోని కొందరు కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడం వంటి పరిణామాలతో సహజంగానే బిఆర్ఎస్ పార్టీలో కొంత నీరసం ఆవహించింది. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెల్చుకోక పోవడం కూడా గులాబీ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ పడింది. మరోవైపు లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టు కావడం కూడా ఆ పార్టీని దెబ్బతీసింది. ప్రతిపక్ష నేతగా చురుకుగా ఉండాల్సిన కెసిఆర్ ఇంటికే పరిమితం కావడం చూస్తున్నాం. అధికారం లేకుంటే అసెంబ్లీలో అడుగు పెట్టమన్న రీతిలో కెసిఆర్, జగన్ తీరు ఉంది. ఈ క్రమంలో తమపై అవినీతి కేసుల దాడి పెరగడంతో ఆత్మరక్షణ కోసం బిఆర్ఎస్ విన్యాసాలు చేస్తోంది. ఎదురుదాడిని ఎంచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్‌పై వస్తున్న ఆరోపణల్లో నిజం ఉన్నా లేకున్నా రచ్చ చేసేందుకు బిజెపికి తోడు బిఆర్ఎస్ కూడా ముందుకు రావడం ఖాయం. ఇప్పటికే కాంగ్రెస్ పాలనా వైఫల్యాల ఆధారంగా కెటిఆర్ గత కొద్ది రోజులుగా దూకుడుగా వ్యవహరి స్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఇద్దరూ అధికార కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. అంశాలవారీగా కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేల చేరిక విషయంలో న్యాయస్థానంలో సవాల్ విసిరారు. బిసి కులగణన,రైతుల రుణ మాఫీ, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై గగ్గోలు చేస్తున్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో విదేశీ కంపెనీకి అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.55 కోట్లు నిబంధనలకు విరుద్దంగా ఇచ్చారని, ఈ కేసులో ఏసీబీ విచారణ చేస్తోంది. దీనిపైనా పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. ఇలా తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన సమయంలో కాంగ్రెస్ అవినీతి వ్యవహారం అంటూ బిజెపి నేతలు విమర్శలు చేయడం సంచలనానికి దారి తీసింది. బిజెపితో బిఆర్ఎస్‌కు లోపాయకారి ఒప్పందం ఉందని ఆరోపించినంత మాత్రాన ఆరోపణల తీవ్రతను తగ్గించలేం. ఈ క్రమంలో తెలంగాణలో తమపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా మంత్రులు జాగ్రత్తగా ఉండాలి. ప్రజా సమసయలపై శ్రద్ద పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా మంత్రి కేటీఆర్ ఇప్పటికే అమృత్ టెండర్ల వ్యవహారన్ని తెరపైకి తెచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి అమృత్ పథకంలో స్కాంకు తెరలేపారని ఆరోపించారు. అంతే కాకుండా రెవెన్యూ మంత్రి పొంగులేటికి సంబంధించిన స్కాంలను బయటపెడతానని కెటిఆర్ గతంలోనే హెచ్చరించారు. తప్పులేదు. రేవంత్, పొంగులేటిలు తప్పు చేసివుంటే కోర్టుకీడ్చాల్సిందే. అందుకే అందిరి అవినీతిపైనా చర్చ జరగాలి. విచారణ జరగాలి. కేసులు వేయాలి. అందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు మాత్రమే పరిష్కారం చూపగలవు. అందుకు రాజకీయ నేతలు సిద్దమా కాదా అన్నది చెప్పాలి.

# హద్దులు లేని రీ సర్వే...ఏపీలో అంతా అయోమయం



సెంట్రల్ డెస్క్:స్వమిత్వ యోజనతో గ్రామీణ భారతంలోని 3 లక్షల పల్లెల్లో రూ. 100 లక్షల కోట్ల ఆస్తులకు విముక్తి కల్పించినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అధునాతన డ్రోన్, జీఐఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి 2.25 లక్షల మందికి ఆస్తి కార్డులు, రిరార్డ్ ఆఫ్ రైట్స్ ను అందిచినట్టు సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నారు. ఇక ఏపీ విషయానికి వస్తే.. ఈ భూ వివాదాలు ఇప్పట్లో పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించటం లేదు. జానెడు భూమి కోసం భూస్వాములు.. పేదల మధ్య పేచీ కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం పంచిన అసైన్డ్ భూములనూ పెత్తందారులు కొల్లగొట్టేస్తున్నారు. న్యాయం కోసం పేదలు కోర్టు తలుపు తడితే.. జీవిత కాలం విచారణ తట్టుకోలేక పేదలే తమ హక్కులను పెద్దోళ్లకు ధారాదత్తం చేయక తప్పటం లేదు. ఇక ఏపీలో టైట్లింగ్ యాక్టుతో ..సుమారు రూ.2లక్షల కోట్ల చుక్కల భూముల్ని కొల్లగొట్టిన రాజకీయ పెత్తందారులు జనానికి చూపించారు. ఏకంగా రైతు భూమిలో సరిహద్దును సీఎం ముఖ చిత్రం సర్వేరాళ్లు నిర్ధారించాయి. భూమి హక్కులను సీఎం ముఖచిత్రం ఖరారు చేసింది. అన్నిటికంటే.. అసైన్డ్ భూముల్లో పేదల హక్కుల్ని కాలరాశారని కూటమి ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా ల్యాండ్ గ్రాబింగ్ యాక్టును తెరమీదకు తీసుకు వచ్చారు. మళ్లీ ఈ భూముల రీసర్వేను షురూ చేసింది. హమ్మయ్యా .. పెద్దోళ్లు గుంజుకున్న భూములు తమ చేతికి వస్తాయని పేదోళ్లు సంబురం చేసుకొంటున్నారు. కానీ ఈ భూ జగడాలు ఇప్పట్లో తీరటం .. మామూలు కథ కాదు.. ఇది నిజంగా ఓ నైట్ మేర్ స్టోరీనే.. అని పరిశీలకుల అంచనా.ల్యాండ్ టైట్లింగ్ పోయింది. ల్యాండ్ గ్రాంబింగ్ ప్రివెంటివ్ యాక్ట్ వచ్చింది. పిల్లి పిల్లి మధ్య చేరిన కోతి మాదిరి.. ప్రస్తుతం రీ సర్వే వ్యవహారం సిత్రాలు మీద సిత్రాలు చూపిస్తోంది. భూమి రీ సర్వేతో గత ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు జరిగాయని కూటమి ప్రభుత్వం ఆరోపించింది. అసలు టైట్లింగ్ యాక్ట్ మంచిది కాదని, దీనిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు అసెంబ్లీలో ల్యాండ్ గ్రాంబింగ్ ప్రివెంటివ్ యాక్ట్ బిల్లు పెట్టి ప్రభుత్వం ఆమోదించింది. అందరూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు అయిందని హ్యాపీ పీలయ్యారు. భూమి రీ సర్వే ను ప్రభుత్వం ప్రారంభించింది. గతంలో మాదిరి త్వరగా సర్వే పూర్తి చేయటానికి ప్రయత్నించటం లేదు. ప్రతి వివాదంలోనూ ఆచీతూచీ వ్యవహరిస్తోంది. ఏ రోజు ఏ ప్రాంతానికి రీ సర్వే చేసేందుకు సర్వేయర్లు వస్తున్నారో ఆ ప్రాంత పొలాల రైతులకు ముందు రోజు సమాచారం ఇస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉంది కానీ, వివాదాల పరిష్కారం జోలికి వెళ్లటం లేదు. ఎందుకంటే ఎవరి హద్దుల్ని వారికే అప్పగించాలని లక్ష్యం కావచ్చు.

### హద్దులు లేని కొలతలు

వాస్తవ రెవెన్యూ రికార్డు ప్రకారం, ఏపీలోని 17,583 గ్రామాల్లో 1,30,30,298 సర్వే నంబర్లు ఉన్నా యి. వీటితో 2,90,92,995 ఎకరాల విస్తీర్ణంలోని భూమితో ముడిపడి ఉంది. వెబ్‌ల్యాండ్ ఆర్ఎస్ ఆర్‌లో 1,35, 05,283 సర్వేనంబర్లలో 3,40,23,510 ఎకరాల భూమి ఉన్నట్లు ప్రభుత్వ నివేదిక చెబుతోంది. కానీ సర్వే చేసేటప్పుడు ఎవరి భూమి ఎంతవరకు ఉందో రైతే చూపించాలి. వాస్తవానికి ఎవరి పేరుతో ఏ సర్వే నెంబరులో ఎంత భూమి ఉందో రికార్డుల్లో ఉంటుంది. ఆ వివరాలు కూడా సర్వేయరు వద్ద ఉంటాయి. ఇద్దరు రైతుల మధ్య గట్టు సమస్యలు కావొచ్చు. ఒకరి పొలాన్ని మరొకరు ఆక్రమించుకుని ఉండొచ్చు. ఆ విషయం వారికి చెబితే అది పరిష్కరించే పని మాది కాదు. కొలత వరకు మాత్రమే చేస్తాం అని సర్వేయర్లు అంటున్నారు. ఎవరి పొలం ఎంత ఉంది. ఎక్కడి వరకు ఉందో చెబితే దాని ప్రకారం హద్దులు నిర్ణయిస్తున్నారు. అలా కాకుండా సమస్య ఉన్న చోట హద్దులు ఫిక్స్ చేయకుండా ఎవరి పేరుతో ఎంత పొలం ఉందో గతంలో ఉన్న వివరాల ప్రకారం వివాదంలోని పొలాలన్నింటికీ ఒకే నెంబరు కిందకు తీసుకొచ్చి ఆ భూమి యజమానుల పేర్లు కలిపి రాస్తున్నారు. దీని వల్ల కొత్తగా ఇవ్వబోయే ఈ పాస్ పుస్తకాల్లో ఎంత మంది రైతుల భూమి హద్దులు ఫిక్స్ చేయలేదో వారందరి పేర్లు ఉంటాయి. ఈ సమస్య పరిష్కారం అయిన తరువాత మాత్రమే ఆ రైతుల హద్దులు నిర్ణయిస్తారు. అంతవరకు అందిరి పేర్లు అందరి పాస్ పుస్తకాల్లో ఉంటాయి. అంటే.. భూ హక్కు ఎవరిదో.. తేలటం లేదనేది నిర్వివాదంశం.

### ఇటు తలపోటు.. అటు నోట్ల పండగ

ఈ రీ సర్వే వ్యవహారంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక వైపు అధికారులకు తలపోటు .. మరో వైపు సిబ్బందికి నోట్ల పండుగ వాతావరణం కనిపిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాత రికార్డులు ఉన్నాయి. ఎప్పటి కప్పుడు సర్వే జరిగిన రికార్డులను ప్రభుత్వం ఇవ్వటం లేదు. సర్వే పూర్తయిన తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డుల్లో అప్డేట్ చేయాలి. ఈలోపు భూముల క్రయవిక్రయాలు సమస్యగా మారింది. సర్వే తరువాత ఓ వ్యక్తి తన భూమిని వేరే వారికి అమ్మాలనుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆన్ రికార్డుల్లోని సర్వే నెంబర్లకు, రెవెన్యూ రికార్డుల్లోని సర్వే నెంబర్లకు పొంతన కనపడటం లేదు. రీ సర్వే తరువాత ఆ పొలాలకు కొత్త నెంబర్లు అలాట్ అవుతున్నాయి. దీంతో ఆ పొలాల రిజిస్ట్రేషన్ లు జరగటం లేదు. దీంతో చాలా మంది రైతులు సచివాలయాలకు వచ్చి జరుగుతున్న ఇబ్బందులను అక్కడి సిబ్బందికి చెబుతున్నారు. ఈ సమస్యలు తాము పరిష్కరించేవి కాదని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే పరిష్కరించేందుకు వీలు ఉంటుందని చెబుతున్నారు. కానీ.. తక్షణమే దొడ్డి దారి రిజిస్ట్రేషన్ కు యజమానులు ఎగబడుతున్నారు. ఇంకేముందీ.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆమ్యామ్యా సందడి ఉరలేస్తోందంటే.. కేవలం ఆరోపణ కాదు. ఆ తరువాత మరో భూ జగడం రోడ్డున పడటమూ మామూలే.. అని జనం అంటున్నారు.

### తీరని జగడాలు.. తెరపైకి కొత్త పేచీలు

రీ సర్వే వల్ల సమస్యలు తీరతాయని, ప్రతి ఒక్క రైతుకు హద్దులు నిర్ణయించి సమస్యలు లేకుండా ప్రభుత్వం చేస్తుందని అందరూ భావించారు. కానీ అవేమీ జరగటం లేదు. సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి. వివాదమున్న భూముల సర్వే నెంబర్లు అన్నీ కలిపి సుమారు పది మంది రైతుల పేర్లు ఒకే పాస్ పుస్తకంలో నమోదు చేసి ప్రతి రైతుకూ ఇస్తుండటంతో వారి మధ్య ఉన్న వివాదాలు అలాగే ఉంటున్నాయి. ముందుగా రెవెన్యూ కోర్టులు, ఆ తరువాత న్యాయస్థానాల్లో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. కానీ ఒక్కో మండలంలో వేల మంది సమస్యలు అలాగే ఉంటున్నాయి. సమస్యలు పరిష్కారం ఎప్పటికి జరుగుతుందో%ౌ% విడి విడిగా పాస్ పస్తకాలు ఎప్పటికి వస్తాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

# ఏపీలో పెరుగుతున్న బాల కార్మికులు



విజయవాడ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి పదేళ్లు గడిచినా ఏపీకి ఇప్పటికీ శాశ్వత రాజధాని లేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజల స్థితిగతుల్లో ఎలాంటి మార్పు రాలేదు. ఇంకా ఇంకా ఆర్థికంగా వెనకబడిపోతున్నారు. ఉపాధి లేక వలసలు పోతున్నారు. వాస్తవ పరిస్థితి ఇది కాగా, ప్రపంచంలోనూ, దేశంలోనూ ఏపీని నెంబర్ వన్ చేస్తామని పాలకులు మాత్రం వాగ్దానాల మీద వాగ్దానాలిస్తున్నారు. అయితే ఏపీలో అభివృద్ధి సంగతి పక్కనపెడితే.. పేదరికం విపరీతంగా పెరుగుతోంది. దీంతో బాల కార్మికులు పెరుగుతున్నారు. ఏయేటికాడు వేల సంఖ్యలో బాల కార్మికులు పెరుగుతున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ లెక్కలే చెబుతున్నాయి.తాజాగా మహిళా శిశుసంక్షేమ శాఖ తెలిపిన లెక్కల ప్రకారం 2020-2024 మధ్య 7,069 మంది బాల కార్మికుల్ని గుర్తించి.. వారు చేసే పని నుంచి అధికారులు విముక్తి కలిగించారు. ఒక్క 2024లోనే అత్యధికంగా 2,245 మంది చిన్నారులను పని చెర నుంచి రక్షించినట్లు లెక్కలు చెబుతున్నాయి. 2020లో 671, 2021లో 1,028, 2022లో 1,229, 2023లో 1,895 మందిని రక్షించడం జరిగింది. ఇక జిల్లావారీగా చూస్తే.. 2024లో చిత్తూరులో అత్యధిక బాల కార్మికులున్నారు. ఈ జిల్లాలో 258 మంది బాల కార్మికులను గుర్తించి వారు చేస్తున్న పని నుంచి విముక్తి కలిగించారు. ఆ తర్వాత నెల్లూరు 237, విజయనగరం 226, శ్రీకాకుళం 214, ఎన్టీఆర్ జిలాలో 200 మంది బాల కార్మికుల్ని రక్షించారు. కాగా, అనకాపల్లిలో అయితే ఒకరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆరుగురు, పార్వతీపురం జిల్లాలో తొమ్మిది మంది బాల కార్మికుల్ని గుర్తించారు. అయితే, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒక్కరు కూడా కార్మికులు లేకపోవడం విశేషం.14 ఏళ్లలోపు చిన్నారులు బాల కార్మికులుగా మారడానికి ప్రధాన కారణం పేదరికమే. కుటుంబానికి సరైన ఆదాయం లేకపోవడం వల్ల చిన్నారులు పనికెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎయుటిడి (అసోసియేషన్ ఫర్ అర్బన్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్) కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

### బాల కార్మిక చట్టం..

బాల కార్మిక చట్టం (1986) సవరణ 2016ను ఉల్లంఘించిన వారిని జరిమానా విధించడంతో పాటు జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉంది. బాలకార్మిక ఊబి నుంచి రక్షించబడిన చిన్నారులకు పునరావాసం కల్పించడంతో పాటు విద్యను అందించాలని కూడా ఈ చట్టం పేర్కొంది. ఈ చట్ట ప్రకారం%ౌ% మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు చిన్నారులను కుటుంబాలకు గానీ, వారికంటూ ప్రత్యేక ఎన్‌జీవోల్లోనూ పునరావాసం కల్పించడం చేశారు. గతేడాదిలో రక్షించిన 2,246 మంది చిన్నారుల్లో 677 మందికి అధికారులు పునరావాసం కల్పించారు. 1,569 మంది చిన్నారులను వారి కుటుంబాలకు అప్పగించారు. విద్యాశాఖతో సంప్రదింపులు జరిపి, ఈ చిన్నారులకు విద్యను అందించే ప్రయత్నం చేస్తున్నామని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జి. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

# జనార్ధన్‌రావు హత్య కేసులో నోరువిప్పిన నిందితుడు

హైదరాబాద్,వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత జనార్దన్ రావు హత్య సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత మనమడే ఆయన్ను 72 సార్లు కత్తితో పొడిచి చంపేయడం తీవ్ర కలకలం పేరింది. ఈ కేసులో నిందితుడు కీర్తి తేజను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, కీర్తి తేజను నాలుగు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. నాలుగు రోజులుగా నిందితుడిని విచారించిన హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. మొదటి రోజు కీర్తి తేజ నోరు విప్పకపోయినప్పటికీ ఆ తర్వాత హత్యకు గల కారణాలను కీర్తి తేజ పోలీసులకు వివరించాడు. పోలీస్ కస్టడీలో భాగంగా మొదటి రోజు పారిశ్రామివేత్త జనార్దన్ రావును ఎందుకు హత్య చేశావంటూ పంజాగుట్ట పోలీసులు కీర్తి తేజను ప్రశ్నించారు. రెండో రోజూ నిందితుడిని హత్య జరిగిన ఘటనా స్థలానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు ప్రయత్నించారు. అక్కడా నోరు విప్పలేదు కీర్తి తేజ. కానీ, నిందితుడు పారిపోయిన తర్వాత మంటల్లో కాల్చివేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం మాత్రం చిట్టకేలకు కీర్తి తేజ అసలు విషయాలు వెల్లడించాడు. యూ బెగ్గర్ అంటూ తాత జనార్దన్ రావు ప్రతిరోజూ నన్ను అవమానించేవాడు. ఏ రోజూ నన్ను సొంత మనిషిగా చూడలేదు. కుటుంబసభ్యుడిగా భావించలేదు. అందరి కంటే హీనంగా చూస్తూ దారుణంగా వ్యవహరించేవాడు.

ప్రతీరోజూ బెగ్గర్.. బెగ్గర్ అంటూ పిలిచేవాడు. ఆఫీసుకు వెళ్తే అక్కడా అవమానించేవాడు. తాత అలా తిట్టడం వల్ల ఆఫీస్ స్టాఫ్ కూడా చిన్నచూపు చూసేవారు. ఆస్తి పంపకాలు, పదవుల కేటాయింపుల్లోనూ తక్కువ చేశాడు. చివరకు డైరెక్టర్ పదవినీ రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడు. అప్పట్నుంచి నాకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయి. అందుకే అతన్ని చంపేయాలని నిర్ణయించుకున్నా. ఇన్‌స్టామార్ట్ నుంచి కత్తి కొనుగోలు చేసా. బట్టలు తగలబెట్టేందుకు అమెజాన్ బ్యూటేన్ గ్యాస్ కొనుగోలు చేశా. హత్య జరిగిన రోజు నాకు, తాతకు మధ్య పెద్దఎత్తున గొడవ జరిగింది. ఆస్తిలో వాటా కావాలని అడిగితే ఇవ్వను అన్నాడు. కోపంతో కత్తితో కసితీరా పొడిచా. హత్య చేసిన తర్వాత బీఎస్ మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఖాళీ స్థలంలో కత్తి, రక్తంతో ఉన్న నా బట్టలు తగులబెట్టానని" తెలిపాడు.

# మహాయతి కూటమిలో పెరుగుతున్న అగాథం

ముంబై, మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో చీలికలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హోంశాఖ మంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన 20 మంది ఎమ్మెల్యేలకు ఉన్న వై కేటగిరి సెక్యూరిటీని ఉపసంహరించుకున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. బీజేపీ, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలకు భద్రతాను కూడా తగ్గించబడినప్పటికీ, శివసేన నుంచి వచ్చిన వారి కంటే ఈ సంఖ్య చాలా తక్కువ ఉంది.అయితే, రాష్ట్ర వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి సీఎం ఫడ్నవీస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. మంత్రులు కాకపోయినా, ఈ ఎమ్మెల్యేలకు అదనపు ప్రయోజనంగా వై-భద్రతా మంజూరు చేయబడంతోనే ఈ తొలగింపులు జరిపినట్లు సమచారాం. 2022లో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన నుంచి విడిపోవడంతో మహా వికాస్ అఘాడి ప్రభుత్వం పతనానికి దారితీసింది. దీంతో పార్టీ మారిన ఈ ఎమ్మెల్యేలకు పటిష్ట భద్రతను మహారాష్ట్ర సర్కార్ కేటాయించింది. ఇక, ఈ నిర్ణయంతో ఏక్‌నాథ్ షిండే, బీజేపీ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది. తాజా చర్యతో సీఎం ఫడ్నవీస్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి చేసిన వ్యూహాత్మక ఎత్తుగడగా కమలం పార్టీ నేతలు భావిస్తున్నారు. అయితే, దావోస్ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి ఎన్సీపీకి చెందిన తత్కరే (శ్రీవర్ధన్)ను రాయ్‌గఢ్ సంరక్షక మంత్రిగా నియమించారు. దీంతో రాయ్‌గఢ్, నాసిక్‌లకు సంరక్షక మంత్రి పదవుల కోసం బీజేపీ, షిండే పార్టీల మధ్య ప్రారంభమైన ప్రతిష్టంభన ? ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత కూటమిలో స్పష్టంగా విభేదాలు కనిపిస్తుండటపై శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది తీవ్ర విమర్శలు గుప్పించింది. సీఎం పదవి రాకపోవడంతో షిండే అసంతృప్తిగా ఉన్నారని చెప్పుకొచ్చింది. దీంతో పాటు ఫడ్నవీస్‌తో వేదిక పంచుకోవడానికి ఏక్‌నాథ్ షిండే దూరంగా ఉంటున్నట్లు ప్రియాంక చతుర్వేది పేర్కొన్నారు.

# సంక్లిష్టంగానే పోప్ ఆరోగ్యం

రోమ్,పోప్ ఫ్రాన్సిస్ (88) ఆరోగ్యం ఇంకా సంక్లిష్టంగానే ఉన్నట్లుగా వాటికన్ సిటీ తెలిపింది. గత శుక్రవారం శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో రోమ్‌లోని జెమెల్లి ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూనే ఉన్నారు. మరి కొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం ఉందని వాటికన్ పేర్కొంది.ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షల్లో శ్వాసకోశంలో పాలీమైక్రోబయల్ ఇన్ఫెక్షన్ సోకినట్లు తెలిపింది. దీన్ని నుంచి ఇంకా కోలుకోలేదని తెలిపింది. తాజాగా నిర్వహిచిన టెస్టులను బట్టి మరిన్ని రోజులు ఆస్పత్రి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాటికన్ తెలిపింది. జ్వరం నుంచి అయితే ఫ్రాన్సిస్ కోలుకున్నారని తెలిపింది. ఇక ఫ్రాన్సిప్ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు గాజాలోని ఏకైక కాథలిక్ పారిష్ వాకబు చేస్తూనే ఉన్నారు. ఇక సోమవారం పోప్ ఫ్రాన్సిస్ కొంత సేపు పని చేశారని, పత్రాలు కూడా చదివారని వాటికన్ తెలిపింది. ఫ్రాన్సిస్.. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.

# మా పరిస్థితేంటి?

హైదరాబాద్, తెలంగాణలో రాజకీయాలు బీసీల చుట్టూనే తిరుగుతున్నా యా? అధికార కాంగ్రెస్ పార్టీ వేసిన అస్త్రానికి విపక్షాల్లో వణుకు మొదలైందా? అదే జరిగితే తమ పరిస్థితి ఏంటని నేతలు ఎందుకంటున్నారు? వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే రాజకీయాలు తిరుగుతాయా? అదే జరిగితే బీఆర్ఎస్ పరిస్థితి ఏంటనేది అసలు చర్చ. దీనిపై హైకమాండ్ నుంచి నేతలకు ఎలాంటి సంకేతాలు వచ్చాయి?

### తెలంగాణ రాజకీయాలు కొత్త మలుపు

రాజకీయాల్లో ఎత్తుకు పైఎత్తులు వేయాలి. సమయం, సందర్భంగా వ్యవహరించిన వారు మాత్రమే నిలదొక్కుకుంటారు. లేకుంటే వెనుకబడిపోవడం ఖాయం. తెలంగాణలో రాజకీయాలు ఇప్పుడు బీసీల చుట్టూనే తిరుగుతోంది. కాంగ్రెస్ ప్లాన్ ప్రకారం బీసీలకు రాజ్యాధికారం కావాలనే పట్టుబడుతున్నారు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ. ఈ క్రమంలో తెలంగాణలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాదిలోపు కులగణన చేపట్టారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉందని నివేదిక తేల్చింది.తెలంగాణకు భవిష్యత్తులో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతాడని బయటపెట్టారు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్. రాష్ట్రానికి బీసీ వ్యక్తిని సీఎం చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐదేళ్లు కొనసాగుతారని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలు బీసీల చుట్టూనే తిరుగుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని ఓబీసీ సెల్ కార్యవర్గ సభ్యులకు పిలుపునిచ్చారు ఆయన.

### పదేళ్ల కిందట టీడీపీ

ఈ వ్యవహారంపై మిగతా రాజకీయ పార్టీల్లో చర్చ మొదలైంది. 2014 ఎన్నికల్లో బీసీ వ్యక్తి సీఎం అనే నినాదాన్ని ఎత్తుకుంది టీడీపీ. ఆ సమయంలో టీడీపీకి బాగానే సీట్లు వచ్చాయి. ఇక 2023 నాటికి వద్దాం. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్గొండలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తి సీఎం అవుతారని చెప్పుకొచ్చారు ఆయన.కాంగ్రెస్‌ను దెబ్బకొట్టడానికి అప్పట్లో ఈ ఫార్ములాను అమిత్ షా ఉపయోగించారనే ప్రచారం సాగింది. ప్రస్తుతానికి వచ్చేద్దాం.. రాహుల్‌గాంధీ మొదటి నుంచి బీసీ నినాదం ఎత్తుకున్నారు. ఈ విషయంలో బీజేపీ తర్జన భర్జన పడుతోంది. ఏం చెయ్యాలో తికమక పడుతోంది. కనీసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నట్లుగా కులగణన చేయడానికి ముందుకు రావడంలేదు.

### కన్ఫ్యూజన్‌లో బీఆర్ఎస్

ఇక బీఆర్ఎస్ విషయానికొద్దాం. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ చేసిన కామెంట్స్ బీఆర్ఎస్‌లో అప్పుడే అలజడి మొదలైనట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో కాబోయే ముఖ్యమంత్రి బీసీయేనని చెప్పడంతో ఒక్కసారిగా నేతలు షాకయ్యారు. దీనిపై ఏ ఒక్కరూ నోరు ఎత్తకూడదని సంకేతాలు వెళ్లినట్టు ప్రచారం మొదలైపోయింది.2014 ఎన్నికల్లో తెలంగాణ వస్తే దళితుడ్ని సీఎం చేస్తామని కేసీఆర్ పదేపదే చెప్పుకొచ్చారు. గడిచిన పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో బీసీ, మహిళలకు సరైన ప్రాధాన్యత దక్కలేదని చాలామంది నేతల మాట. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్ విసిరిన బీసీ బాణం.. అప్పుడే ఆ పార్టీలో చర్చకు దారితీసిందని సమాచారం. మరి జాతీయ పార్టీల మాదిరిగా బీఆర్ఎస్ పార్టీ కూడా బీసీ నినాదం ఎత్తుకుంటుందా? అన్నదే అసలు పాయింట్. మొత్తానికి కాంగ్రెస్ ట్రాప్‌లో కారు పడినట్టేనని అంటున్నారు.

# తారకరత్న వర్ధంతి సందర్భంగా అలేఖ్య ఎమోషనల్ పోస్టు

అమరావతి,నటుడు, టీడీపీ నాయకుడు నందమూరి తారకరత్న మరణించి రెండేళ్లు పూర్తయింది. 2023 జనవరి 27న యువగళం పాదయాత్రలో పాల్గొన్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. గుండెపోటు రావడంతో ఆయన్ను తొలుత కుప్పంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చేర్పించారు.

## త్వరలోనే రష్యా అధినేత పుతిన్‌తో భేటీ

వాషింగ్టన్,త్వరలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అవుతానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కొన్ని రోజుల్లో అమెరికా-రష్యా మధ్య సౌదీ అరేబియాలో ఉక్రెయిన్‌పై శాంతి చర్చలు జరుగనున్నాయి. అయితే ఉక్రెయిన్ లేకుండానే ఈ చర్చలు చేపడుతున్నారంటూ వస్తున్న విమర్శలపై ట్రంప్ స్పందించారు. యుద్ధాన్ని ముగించే ఏ చర్చల్లోనైనా జెలెన్స్కీ భాగస్వామి అవుతారని ట్రంప్ వివరణ ఇచ్చారు. అంతేకాదు.. చాలా తొందరలో రష్యా అధినేతతో తాను భేటీ కానున్నట్లు చెప్పారు. ఆయన ఎ÷-లోరిడాలోని డెటోనా రేసులో పాల్గొన్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'కచ్చితమైన సమయం అనుకోలేదు.. కానీ, తొందర్లోనే జరుగుతుంది' అని విలేకర్లతో పేర్కొన్నారు. మరోవైపు అమెరికా-రష్యా చర్చలకు దూరంగా ఉన్న బ్రిటన్ భిన్నమైన ప్రకటన చేసింది. ఆ దేశ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ అవసరమైతే ఉక్రెయిన్‌లో తమ సేనలు బరిలోకి దిగుతాయని అన్నారు. ఐరోపా దేశాల అత్యవసర సమావేశానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇది ఉక్రెయిన్ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు. ఐరోపా ఉనికికే కీలకమైంది. సుదీర్ఘకాలం కాలం పాటు ఉక్రెయిన్‌లో శాంతి, సురక్షితను కాపాడటం చాలా ముఖ్యం' అని పేర్కొన్నారు. మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే శాంతిచర్చల దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగడం ఆసక్తి రేపుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇప్పటికే ఆయన ఫోన్లో మాట్లాడారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం నిలిపివేయడం వల్ల తలెత్తే పరిణామాలపై ఇప్పుడు ఈయూ దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. యుద్ధ విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తమ భద్రతకు ముప్పు తలెత్తవచ్చన్న ఆందోళన ఐరోపా దేశాల్లో ఉంది. రష్యా కన్ను తమపై పడే అవకాశం ఉందని అవి భావిస్తున్నాయి. చర్చలపై ట్రంప్ దృష్టిసారించంగా ఇయు దేశాలు సోమవారం పారిస్‌లో అత్యవసరంగా సమావేశం కాబోతున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా సోమవారం యుఎఇకి చేరుకొన్నారు. భారీ మానవీయ సహాయ కార్యక్రమం నిమిత్తం తాను ఇక్కడికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. రష్యాతో చర్చల కోసం సౌదీ అరేబియాకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్‌కోఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్‌వాల్ట్జ్ కూడా రియాద్‌కు ప్రయాణమయ్యారు. ఈసందర్భంగా రియాద్‌లోని కొందరు అధికారులు మాట్లాడుతూ ఈ చర్చలకు వేదిక కావడంతోపాటు.. మధ్యవర్తిత్వంలోను తమ దేశం కీలకపాత్ర పోషించనుందన్నారు.

## గులాబీ బాస్ కొత్త స్కెచ్

హైదరాబాద్,సిర్పూర్ టీ కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ విచిత్రమైన రాజకీయానికి తెర లేపింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ మధ్య గులాబీ పార్టీ స్థానిక సమరం పరీక్ష పెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు పార్టీకి ఎక్కువ స్థానాలు దక్కించుకుని వస్తే వారికి పార్టీ ఇన్చార్జ్ పదవి కట్టబెడతారంట. అర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సిర్పూర్ టీ నుండి సాగనంపేందుకే గులాబీ బాస్ ఈ పరీక్ష పెట్టారన్న టాక్ వినిపిస్తుంది. మరి లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో ఆర్ఎస్‌పై కోనప్ప పైచేయి సాధిస్తారా? అసలు కాంగ్రెస్‌లో చేరిన కోనప్ప అంతలోనే ఎందుకు యూటర్న్ తీసుకున్నారు?

సిర్పూర్ టీ బీఆర్ఎస్ ఇన్చార్జ్ పదవి కోసం పోటాపోటీ

కొమురం భీమ్ జిల్లా సిర్పూర్ టీ నియోజకవర్గం ఇన్చార్జ్ పదవి కోసం గులాబీ పార్టీలో మళ్లీ యుద్ధం మొదలైంది. ఈ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి బీఅర్ఎస్ వైపు చూస్తుండటంతో అక్కడ రాజకీయం రసకందాయంలో పడింది .. కాంగ్రెస్‌తో తన రాజకీయ జీవితం ప్రారంభించిన కోనప్ప 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున సిర్పూర్ శాసనసభ నియోజకవర్గం నుండి మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచార. 2009 ఎన్నికలతో పాటు 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో పరాజయం పాలైన ఆయన తర్వాత తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు.

2014లో బీఎస్పీ టికెట్‌తో గెలిచి టీఆర్ఎస్ లో చేరిక

రాష్ట్ర విభజన సమయంలో కోనప్ప కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు. 2014లో జరిగిన తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ టికెట్ పై పోటీ చేసి రెండు సార్లు తనను ఓడించిన కావేటి సమ్మయ్యపై విజయం సాధించారు. గెలిచాక గులాబీ కండువా కప్పుకున్న ఆయన 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికలలో టీఆర్ఎస్ టికెట్ పై పోటీచేసి సిర్పూర్ నుంచి మూడో సారి విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కోనప్ప తిరిగి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి హరీష్ బాబు చేతిలో పరాజయం పాలయ్యారు.

లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో పొత్తు ..

2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని అప్పట్లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రాధాన్యత ఇవ్వడం రుచించని కోనప్ప కారు పార్టీకి గుడ్ బై చెప్పి హస్తం నీడకు చేరారు. అయితే కాంగ్రెస్‌లో తనకు సరైన ప్రాధాన్యత లభించడం లేదన్న అసంతృప్తితో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తిరిగి కారు ఎక్కడానికి రెడీ అయిన ఆయన ఇటీవల ఫాంహౌస్‌కు కేసీఆర్‌ను కలిసి వచ్చారంట. ఆ సందర్భంగా కేసీఆర్ పార్టీలోకి తిరిగి రావాలని కోనప్పను ఆహ్వానించారని తెలిసింది. అయితే బీఆర్ఎస్ బాస్ కోనప్పకి ఒక షరతు పెట్టారని ప్రచారం జరుగుతోంది.

స్థానికి సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని షరతు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సిర్పూర్ టీ నియోజకవర్గంలో సత్తాచాటాలని పెట్టిన షరతుని కోనప్ప కూడా సవాలుగా తీసుకున్నారంట. అయితే కోనప్ప రాకను మాజీ ఐపీఎస్ అధికారి అర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యతిరేకిస్తున్నారని చెప్తున్నారు. ప్రస్తుతం సిర్పూర్ నియోజకవర్గం లో అర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ ఇన్చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారంట. అందుకే కోనప్ప రాకను అర్ఎస్పీ తీవ్రంగా వ్యతరేకిస్తున్నారంట.

కేటీఆర్‌ను కలిసి అభ్యర్థించిన ప్రవీణ్ కుమార్

ఆ మాజీ ఐపీఎస్ అధికారి తన అనుచరగణంతో హైదారాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు కేటిఅర్‌తో భేటీ అయ్యారంట. కోనప్పను పార్టీలోకి తీసుకోవద్దని కేటీఅర్ ను అభ్యర్థించినట్లు చెప్తున్నారు .. అయితే కేటీఆర్ కూడా ఆయనకు అదే టాస్క్ పెట్టారంట. స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటండి. మెజారిటీ సీట్లు సాధించుకు రమ్మని ఆర్ఎస్పీకి టార్గెట్ ఇచ్చారంట. లోకల్‌బాడీ ఎలక్షన్స్‌లో సత్తా చాటుకుంటే ఎవరినీ పార్టీలోకి తీసుకోబోమని కేటీఆర్ ఆయనకు హామీ ఇచ్చినట్లు ఆర్ఎస్పీ వర్గీయులు చెప్పుకుంటున్నారు.

ప్రవీణ్, కోనప్పలకి విషమ పరీక్షగా మారిన స్థానిక ఎన్నికలు

కోనప్ప చేరికను ప్రవీణ్‌కుమార్ వ్యతిరేకిస్తుండటంతో కేసీఆర్ కూడా కోనప్పను స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుకుంటే పార్టీలోకి తీసుకుంటామని చెప్పారంట ఆ క్రమంలో అటు ప్రవీణ్‌కుమార్‌కి, ఇటు కోనేరు కోనప్పకి స్థానిక సంస్థల ఎన్నికలు విషమ పరీక్షగా మారాయంటున్నారు. ఆ పరీక్షలో సత్తాచాటడానికి కోనప్ప సిద్ధమవుతున్నారు.

# రాజాసింగ్ డెడ్ లైన్.. కమలంలో కొత్త రచ్చ



హైదరాబాద్,కమలం పార్టీలో సంస్థాగత ఎన్నికలు చిచ్చుపెడుతున్నాయా.. సంస్థాగత ఎన్నికలు సందర్భంగా నేతల మధ్య విభేదాలు, విద్వేషాలు బయటపడుతున్నాయా.. జిల్లా అధ్యక్షుల ఎంపికపై నేతలు%ౌ% ఆగ్రహంతో తమ అసహనాలు బయటపెడుతున్నారా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పేరుకే సంస్థగత ఎన్నికలా..? అంతా లాబీయింగ్ లేనా.. అంటూ రాష్ట్ర నాయకత్వంపై నేతలు విరుచుకుపడటం హాట్ టాపిక్‌గా మారింది. ఫైర్‌బ్రాండ్‌గా ఉన్న రాజాసింగ్ వ్యాఖ్యలతో.. నాయకత్వం ఆలోచనలో పడిందట. ఇంతకీ%ౌ%ఆయన ఏమన్నారు. అసలేం.. జరిగింది. తెలంగాణ బీజేపీలో మళ్లీ రచ్చ మొదలైందంటూ వార్తలు గుప్పుమంటున్నాయి. పార్టీలో సంస్థాగతంగా ఎన్నికలు నిర్వహించుకుంటున్న నేపథ్యంలో జిల్లా అధ్యక్షుల నియామకంపై విమర్శలు%ౌ%పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి. మొదటి విడతలో 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించిన కాషాయ పార్టీ రెండో విడతలో నలుగురు పేర్లు ప్రకటించింది. దీంతో అధ్యక్షుల సంఖ్య 23కి చేరింది. మిగిలిన జిల్లాల్లో అధ్యక్ష ఎంపికను పెండింగ్‌లో పెట్టి ఊరిస్తూ వస్తోంది. అయితే అధ్యక్షుల ప్రకటనలో ఊరిస్తోందా.. లేక అనుకున్న వారికి ఇచ్చేందుకు యత్నాలా అనే వార్తలు గుప్పుమంటున్నాయి. తాజాగా ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలతో ఆ వాదనలకు ఆజ్యం పోసినట్లు అయ్యిందనే కామెంట్స్ జోరుగా వినిపిస్తున్నాయి. మహిళలకే పెద్దపీట వేస్తామంటూ ప్రేమ ఒలకబోసిన కమలం పార్టీ..ఇప్పటి వరకూ ప్రకటించిన 23 జిల్లాల అధ్యక్షుల్లో కేవలం ఒక్క మహిళకే అవకాశం ఇచ్చి..విమర్శలపాలవుతోంది. సంగారెడ్డి జిల్లా మినహాయిస్తే%ౌ% హేమా హేమీలున్న జిల్లాలోనూ మహిళలకు.. ఒక్కరంటే.. ఒక్కరికీ కూడా అవకాశం ఇవ్వకపోవడంతో మహిళా నేతల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందట. అంతేకాదు%ౌ% పార్టీలో పనిచేసే వారికి కాకుండా%ౌ% ఇతరులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు కూడా ముందు నుంచే వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని భారతీయ జనతా పార్టీ చెబుతోంది. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నామని చెప్పుకుంటోంది. అందుకు భిన్నంగా నేతల తీరు కనిపిస్తోందని సొంత పార్టీలో చర్చ జరుగుతోందట. ఇప్పటికే.. బూత్, మండల స్థాయిలో కమిటీలను సైతం ఏర్పాటు చేశామని.. అందులో భాగంగానే ఆయా జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తున్నామని రాష్ట్రనాయకత్వం చెబుతున్న మాట. ఇప్పటికే 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించామని చెబుతున్న కాషాయ పార్టీ.. చెబుతున్న లెక్కలకు.. చేసే పనులకు పొంతన లేకుండా వ్యవహరిస్తోందని.. సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారట. తాజాగా మరో నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించడంతో మళ్లీ రచ్చ మొదలైందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈసారి.. పార్టీలో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న రాజాసింగ్ వంతు వచ్చింది. ప్రకటించిన నాలుగు జిల్లాల్లో గోల్కొండ జిల్లాకు సంబంధించిన అధ్యక్షుడు నియామకం అంశంలో.. ఆయన రాష్ట్ర బీజేపీ నాయకత్వాన్ని ఎడాపెడా ఉతికి ఆరేశారట. %వీ×వీ, దీ=ా%తో కుమ్మక్కై తిరిగిన.. ఉమా మహేంద్రకు%ౌ% అధ్యక్ష పదవి ఎలా కట్టబెడతారంటూ మండిపడ్డారట. ఇప్పటికే అధ్యక్షులను ప్రకటించిన జిల్లాల్లో మెజారిటీ జిల్లాల్లో అసంతృప్తి. పీక్ స్టేజీలో ఉన్న నేపథ్యంలో రాజాసింగ్ చేసిన కామెంట్స్.. హాట్‌గా మారాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. అసలే.. ఎంపిక విషయంలో ఇబ్బందుల్లో ఉన్న అధిష్టానానికి%ౌ% రాజాసింగ్ లాంటి వ్యక్తి ప్రశ్నలతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందంటూ ప్రచారం సాగుతోంది. తెలంగాణ బీజేపీ అంటే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది ఎమ్మెల్యే రాజాసింగ్ పేరు. ఆ పార్టీలో ఆయన ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రత్యర్థులను తనదైన శైలిలో ఇరకాటంలో పెట్టే వ్యక్తిగా రాజాసింగ్‌కు ఫాలోయింగ్ కూడా ఉంది. అలాంటి వ్యక్తి.. సొంతపార్టీపై చేసిన హాట్ కామెంట్స్.. రాష్ట్ర నాయకత్వానికి కొరకరాని కొయ్యగా మారాయనే టాక్ నడుస్తోంది. రాజాసింగ్ అంటే..ఒక మతానికి ఫైర్ బ్రాండ్‌గా చెబుతుంటారు. బీజేపీకి సంబంధించిన హిందువులుఆయన్ను అమితంగా ఇష్టపడుతారు. అలాంటి నేతకు.. ఇప్పుడు పార్టీలో ఆదరణ కరువైందనే వార్తలు గుప్పుమంటున్నాయి. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడ కూడా రాజాసింగ్ కనిపించకపోవటంతోవస్తున్న వార్తలకు మరింత బలం చేకూరునట్లు అవుతోంది. ఇక్కడే.. అసలైన ట్విస్ట్ ఉంది. నిజంగానే పార్టీ నేతలురాజాసింగ్‌ను దూరం పెడుతున్నారా.. లేక పార్టీ వ్యవహారాలు నచ్చక ఆయనే దూరంగా ఉంటున్నారా అనే చర్చ జోరుగా సాగుతోంది. ఉన్న ఫలంగా మరోసారి.. రాజాసింగ్ సొంత పార్టీపై సంచలనమైన వ్యాఖ్యలు చేయడంతోఆ పార్టీలో సంస్థాగతంగా ఏం జరుగుతోందో తెలియని గందరగోళ పరిస్థితుల్లోకి పార్టీ శ్రేణులు వెళ్లారనే టాక్ బలంగా వినిపిస్తోంది. జిల్లాల అధ్యక్షుల నియామక అంశంలో%ౌ% ఎంపీలు, ఎమ్మెల్యేలు.. వారి వారి నియోజకవర్గాలలో కొందరి పేర్లు ప్రతిపాదిస్తూ వారికే అధ్యక్ష పదవులు ఇవ్వాలని అధిష్టానానికి సూచనలు చేశారట. అందులో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా తన నియోజకవర్గంలోని గోల్కొండ జిల్లాకు ఎస్సీ లేదా బీసీ నేతని జిల్లా అధ్యక్షుడుగా నియమించాలని అధిష్టానానికి సూచనలు చేసినట్టుగా తెలుస్తోంది. కానీ.. ఎంఐఎం, బీఆర్ఎస్ తో తిరిగిన ఉమా మహేందర్‌క అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట. అంతేకాదు.. రెండు రోజులు పార్టీ నాయకత్వానికి డెడ్ లైన్ కూడా ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. ఈలోగా అధ్యక్షుడి అంశంలో పార్టీ నిర్ణయం మార్చుకోకపోతే .. తామేంటో చూపిస్తామంటూ హెచ్చరికలు కూడా జారీ చేశారట. అంతేకాదు.. తన అడ్డాగా భావిస్తున్న గోల్కొండ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై రాజాసింగ్ ఆడియో రిలీజ్ చేశారు. అందులో.. తనపై ఎంత కుట్ర కోణం దాగి ఉందో తెలుస్తుందంటూ హాట్ కామెంట్స్ చేశారు. అధిష్టానానికి మాతో పని లేధని అనుకుంటున్నారా..? మాతో అవసరం లేదని అనుకుంటున్నారా.. అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసేశారు. హిందూ ధర్మాన్ని ఆచరించడం నేర్చుకున్నాను తప్ప%ౌ% కొంతమంది చేస్తున్నట్టుగా బ్రోకరిజాన్ని నేర్చుకోలేదనంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. హిందూ ధర్మం కాని బ్రోకరిజం వల్లే%ౌ% తెలంగాణలో ఎప్పుడో అధికారంలోకి రావాల్సిన పార్టీ వెనుకబడిపోయిందనేది రాజాసింగ్ వాదనగా తెలుస్తోంది. కొంతమంది ఉన్నంతకాలం.. తెలంగాణలో అధికారంలోకి రావడం కష్టమేనంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు రాజాసింగ్. అవసరమైతే పార్టీ నుంచి వెళ్లిపోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని.. తమకు పదవులు ముఖ్యం కాదంటూ.. పార్టీ నాయకత్వానికి చురకలు అంటించారు రాజాసింగ్. గత అసెంబ్లీ ఎన్నికల్లో.. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో కమలదళం ఎన్నికలకు వెళ్లింది. మిషన్-90 లక్ష్యంతో.. 90 స్థానాలు సాధిస్తామని చెప్పుకొచ్చిన కమలం నేతలుతొమ్మిది సీట్లు కూడా సాధించలేకపోయారు. అదే అంశంపైనా రాజాసింగ్ ఫైనల్ టచ్ కూడా ఇచ్చేపారేశారు. తన బ్రాడ్ కాస్టింగ్ మీడియా గ్రూపులో.. పార్టీని, పార్టీ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ మెసేజ్ రిలీజ్ చేశారు. పార్టీలో బీసీ నినాదంపైనా రాజాసింగ్ గట్టిగానే విమర్శలు చేశారు. బీసీల పార్టీ అంటారు. బీసీ ముఖ్యమంత్రి అంటారు.. కానీ%ౌ%స్టేట్ అధ్యక్షుడు, బీజేపీఎల్పీ ఫ్లోర్ లీడర్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా వేరే కులస్తులను నియమించారని.. ఇంకెక్కడి బీసీలంటూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు.. కాంట్రవర్రీగా మారాయట. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతున్న నేపథ్యంలో రాజాసింగ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. జిల్లాల అధ్యక్షుల నియామకం కావొచ్చు.. బీజేపీలో బీసీలకు ప్రాధాన్యత అంశంలో కావొచ్చు రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను బిజెపి అధిష్టానం ఎలా తీసుకుంటుందనే అంశం ఉత్కంఠగా మారింది. తన అవసరం పార్టీకి లేదా.. పార్టీ నుంచి వెళ్లమంటే ఈ క్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై.. రాష్ట్రనాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకోనుందే చర్చ సాగుతోంది.

# దక్షిణాదిని దోచుకో..ఉత్తరాదికి ఇచ్చుకో..!



న్యూఢిల్లీ,ఢిల్లీ పాలకుల సవతి తల్లి ప్రేమలో, దక్షిణ భారత దేశాన్ని దోచి ఉత్తర భారతదేశాన్ని పోషిస్తున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. జీఎస్టీ అనేది కేంద్రం, రాష్ట్రాలు విధించే వస్తు, సేవలపై వినియోగ ఆధారిత పన్ను. ఈ పన్ను ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఆదాయాన్ని పొందుతారు. జీఎస్టీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్జించే పన్ను ఆదాయంలో సొంత పన్ను రాబడి. కేంద్ర పన్నుల్లో దాని వాటా ఉంటుంది. కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పన్నుల రాబడిని రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయిస్తోంది. అయితే జీఎస్టీ ప్రవేశ పెట్టడంతో రాష్ట్రాలు తమ ఆర్థిక స్వయం ప్రతిపత్తిని కోల్పోతుండగా.. తమ వ్యయ అవసరాలను తీర్చడానికి అంతర్ ప్రభుత్వం బదిలీల వ్యవస్థపై ఆధారపడటం పెరిగింది. కాబట్టి ఇప్పుడు పన్నుల నికర ఆదా యాన్ని రెండింటి మధ్య న్యాయంగా పంపిణీ చేయడం కేంద్రాల బాధ్యత, జనాభా, జీఎస్టీ కేంద్ర నిధులపై ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య వైరుధ్యం పెరుగుతున్నది. తక్కువ జనాభా, ఆర్థికంగా బలంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు అధికార పంపిణీ తక్కువ వాటా, కేంద్ర నిధులపై ఉత్తర, దక్షిణ వివాదానికి ప్రధాన కారణాలలో ఒకటి.

ఇక్కడ వసూళ్లు.. అక్కడ సంతర్పణలు

కేంద్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఐదు రాష్ట్రాల నుండి జీఎస్టీ కింద వసూలు చేసిన పన్ను మొత్తం 22,26,983.39 లక్షల కోట్లు, ఐదు రాష్ట్రాలకు కేంద్రం విడుదల చేసింది 6,42,295.05 లక్షల కోట్లు. కాషాయ పార్టీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వసూలు చేసిన పన్ను 3,41,817.60 లక్షల కోట్లు ఆ రాష్ట్రానికి కేంద్రం ఇచ్చింది 6,91,375.12 కోట్లు. దీంతో ఉత్తరాది, దక్షిణాది విభజన కథనం ఊపందుకుంది. ఈ సారి ఇది ప్రధానంగా రాష్ట్రాల మధ్య కేంద్ర నిధుల కేటాయింపుపై ఉంది. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర పన్నుల నుంచి తమ చట్టబద్ధమైన వాటాను కోల్పోతున్నామని వాదిస్తున్నాయి.

గత ఆరేళ్లలో పెరిగిన వ్యత్యాసాలు..

అయితే కేంద్రం ప్రస్తుతం అధికార వికేంద్రీకరణ స్థాయిలను రక్షించేందుకు ఫైనాన్స్ కమిషన్ నిబంధనలు ఉదాహరించింది.

భారత దేశం దాదాపు ఒక ఖండం వలె కనిపిస్తుంది. వివిధ రాష్ట్రాల అభివృద్ధి వివిధ దశల్లో ఉన్నాయి. తలసరి ఆదాయాల స్థాయిలలో వ్యత్యాసాలు అటువంటి స్వయం వ్యతాసాలు అంతర్లీనంగా ఉన్నాయి. గత ఆరు సంవత్సరాలుగా ఇటువంటి వ్యతాసాలు బాగా పెరిగాయి. రాబోయే రోజుల్లో తయారీ రంగంలోని భారత్ వృద్ధి వాటాను రాష్ట్రాలకు సమానంగా పంపిణీ చేస్తారా? లేదా అనేది కీలకమైన ప్రశ్న.

పన్ను పంపిణీలో బీజేపీ అన్యాయం!

ఆర్థిక పరివర్తనకు అవసరమైన మూడు ముఖ్యమైన సంస్కరణలు భూమి, కార్మికులు, వ్యవసాయం గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ద్వారా వెనక్కి తీసుకోబడింది. కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల నుండి పన్ను రూపంలో 100 రూపాయలు తీసుకుని తెలంగాణ రాష్ట్రా నికి 49.8 రూపాయలు.. తమిళనాడు రాష్ట్రానికి 29.7రూపాయలు, కర్ణాటక రాష్ట్రానికి 13.9 రూపాయలు, కేరళ రాష్ట్రానికి 63.4 రూపాయలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 46 రూపాయలు.. కేంద్రం ఇచ్చింది. అలాగే ఉత్తర రాష్ట్రాలకు చెందిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పన్ను రూపంలో 100 రూపాయలు చెల్లించగా 333.2రూపాయలు, బిహార్ రాష్ట్రానికి 922.5 రూపాయలు, మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి 279.1 రూపాయలు కేటాయించి కేంద్ర తన సవతి తల్లి ప్రేమను దక్షిణ భారత దేశ ఐదు రాష్ట్రాలపై చూపుతోంది.

సమన్యాయం లభించని విధానాలు..

కేంద్రం అమలు చేస్తున్న ఆదాయ భాగస్వామ్యం నమూనా కొన్ని రాష్ట్రాలకు అన్యాయంగా నష్టం కలిగిస్తుందని బీజేపీయేతర రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. నిధుల పంపిణీ రాష్ట్రాల వ్యక్తిగత ఆర్థిక సహకారాన్ని తగినంతగా ప్రతిబింబించడం లేదు కానీ పంపకాలలో భారీ వ్యత్యాసం కనబడుతుంది. జీఎస్టీ లక్ష్యాలు నేరవేరడం లేదు. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం, పక్షపాతాలు చూపే కేంద్ర ప్రభుత్వాలు ఉన్నత కాలం, ఇలాం టి ఎన్ని పథకాలు వచ్చినా, సమ న్యాయం లభించదు.

## ఎస్ఐ వేధింపులు భరించలేకపోతున్నాం...

భూపాలపల్లి,సాధారణంగా అప్పులు చేసి తీర్చలేకనో, లేకపోతే ప్రేమలో విఫలమయ్యాం అనో.. లేక మార్కులు తక్కువొచ్చాయని, ఫెయిల్ అయ్యామనో ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తుంటాం. కానీ ఎస్సై వేధింపులు తట్టుకోలేకపోతున్నాం.. ఆత్మహత్యకు అనుమతించండి సార్ అంటూ దంపతులు ఫ్లెక్సీతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తమకు చావే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన సంది సులోచన, ప్రతాప్ రెడ్డి దంపతులకు 12 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి వెళ్లడానికి ఉన్న దారిని రెండున్నరేళ్లుగా ములుగు జిల్లా కన్నాయిగూడెం ఎస్సైగా పనిచేస్తున్న ఇనిగాల వెంకటేష్, అతడి సోదరుడు, తండ్రి కలిసి మూసివేశారని దంపతులు ఆరోపించారు. తమ సమస్యపై హైదరాబాద్ వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే ఆ ఎస్సై తమపై అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడేళ్ల నుంచి తమ పొలానికి వెళ్లలేక వ్యవసాయం చేయట్లేదని.. తమకు ఆత్మహత్య తప్ప వేరే దారి లేదని వాపోయారు. కనీసం ఆత్మహత్యకు అనుమతించాలని ఫ్లెక్సీతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట వృద్ధ దంపతులు నిరసన తెలపడంతో తెలంగాణ వ్యాప్తంగా ఈ ఘటన హాట్ టాపిక్ అవుతోంది.

## మూసీపై 17 బ్రిడ్జిలను సర్వే చేయిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్,మూసీ ప్రక్షాళనకు సంబంధించి తెలంగాణ సర్కాం మరో ముందడుగు వేసింది. మూసీ బ్రిడ్జిల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టిసారించింది. మూసీపై ఉన్న 17 బ్రిడ్జిలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సర్వే చేయిస్తోంది. నిజాం కాలంలో కట్టిన బ్రిడ్జిల పటిష్టతను ఇంజనీరింగ్ నిపుణులు పరిశీలిస్తున్నారు. రీబౌండ్ హ్యామర్ టెస్ట్, గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్, డైనమిక్ లోడ్ టెస్టింగ్‌ను సంస్థ నిర్వహిస్తోంది. నాగోల్, ఇమ్లి బండ్, ముస్లింజంగ్, నయాపూల్, పురాణాపూల్, టిప్పు ఖాన్, బాపూఘాట్, అత్తాపూర్, చాదర్ఘాట్, గోల్నాక, సాలార్జంగ్ ప్రాంతాల్లో నిర్మించిన బ్రిడ్జిలను సంస్థ ప్రతినిధులు పరిశీస్తున్నారు. బ్రిడ్జిల పటిష్టతపై మరో నెలలో ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనున్నారు. చాధర్ ఘాట్ బ్రిడ్జి హైట్ పెంచాలని నివేదికను సిద్ధం చేసింది సంస్థ. మూసీ పైనున్న బ్రిడ్జిలను వారసత్వ కట్టడాలుగా ప్రభుత్వం గుర్తించింది. అవసరం అయితేనే పూర్తిగా కూల్చి... వాటి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. మూసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో మూడు నెలల్లో మూసరాం బాగ్ హై లెవెల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. దీన్ని 29.5 మీటర్ల పొడవు, 6 లేన్లతో 20 మీటర్ల క్యారేజ్ వే, 3.5 మీటర్ల ఫుట్ పాత్‌తో నిర్మాణం జరుగుతోంది. దాదాపు రూ.65 కోట్లతో ముసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.

## హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్‌ను దొగించిన ఇన్ఫోసిస్

న్యూఢిల్లీ, ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలైన కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. యూఎస్‌లో ఓ దావాపై ఈ ఇరు సంస్థలు గత కొంతకాలంగా పోరాడుతున్నాయి. ఈనేపథ్యంలో ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ పెద్దఎత్తున ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తమ హెల్త్ కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలని ఇన్ఫీ దొంగిలించిందని విమర్శించింది. ఈవిషయాన్ని ఉటంకిస్తూ ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. నాన్ డిస్‌క్లోజర్ అండ్ యాక్సెస్ అగ్రిమెంట్ ద్వారా ట్రైజెట్టో వాణిజ్య రహస్యాలను దుర్వినియోగం చేస్తూ ఇన్ఫోసిస్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిం దంటూ కాగ్నిజెంట్ ఆరోపించింది. అంతేకాదు ఈవిషయంపై ఆడిట్ చేసేందుకు ఆ కంపెనీ నిరాకరించిందని కాగ్నిజెంట్ తెలిపింది. హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలను ఇన్ఫోసిస్ దొంగిలించిందని ఆరోపించిన కాగ్నిజెంట్ 2024 ఆగస్టులో అమెరికా కోర్టులో దావా వేసింది. ఈ ఆరోపణల్ని ఇన్ఫోసిస్ తిరస్కరించింది. కాగ్నిజెంట్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్ బహిరంగంగా ఉన్నాయని తెలిపింది. అంతేకాదు.. ప్రస్తుతం కాగ్నిజెంట్‌లో ఉన్న రవికుమార్.. తమవద్ద పనిచేసిన సమయంలో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ విడుదల చేయడాన్ని ఆలస్యం చేశారని ఇన్ఫోసిస్ ప్రత్యారోపణలు చేసింది. కాగ్నిజెంట్‌లో ఉద్యోగం కోసం ఆయన చర్చలు జరిపారని పేర్కొంది. ఇన్ఫోసిస్ అధ్యక్షుడిగా వ్యవహరించిన రవికుమార్ 2022 అక్టోబర్‌లో ఆ సంస్థను విడిచిపెట్టారు. ఆ మరుసటి ఏడాది జనవరిలోనే కాగ్నిజెంట్‌లో సీఈఓగా చేరారు. ఈ రెండు ఐటీ కంపెనీలు ఆరోగ్య సంరక్షణ సేవల రంగంలో పోటీపడుతున్నాయి. ఇన్ఫోసిస్ ఆదాయంలో దాదాపు 7.5 శాతం లైఫ్ సైన్సెస్ విభాగం నుంచి పొందుతోంది.

## వేడి తగ్గిన దాడి...

అమరావతి,ఆయన మాటలలో వేడి వాడి ఉంటుంది. మంచి భాషతో పాటు చమత్కారాలు వాడతారు ప్రత్యర్థులను తనదైన వాక్చాతుర్యంతో సెటైర్లతో ఆయన అల్లలాడించగలరు. ఆయన పూర్వాశ్రమంలో మాస్టారు కావడం వల్ల రాజకీయాల్లోనూ ఆయన ఒక విధంగా ఆ గురు పరంపరను కొనసాగించారని చెప్పాలి. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నేత దాడి వీరభద్రరావు గురించి ఇపుడు ఒక రకమైన చర్చ సాగుతోంది. మాస్టారు మౌన ముద్ర దాల్చారు అన్నదే ఆ చర్చ.ఎంతో రాజకీయ అనుభవం కలిగి ప్రతిభా పాటవాలు కూడా ఉన్న నాయకుడు దాడి. ఆయన 1985లో టీడీపీలో చేరారు. ఆ వెంటనే ఎమ్మెల్యే అయిపోయారు. 2004 దాకా అంటే ఇరవయ్యేళ్ళ పాటు ఎమ్మెల్యేగా మంత్రిగా కీలక పదవులు నిర్వహించారు. 2006 నుంచి 2012దాకా శాసనమండలిలో ఎమ్మెల్సీగా కేబినెట్ ర్యాంక్ కలిగిన ప్రతిపక్ష నేతగా కూడా దాడి పనిచేశారు.అయితే రెండోసారి తనను ఎమ్మెల్సీగా చేయలేదన్న బాధతో ఆయన ఒకే ఒక్క తప్పటడుగు వేశారు. నాడు జైలులో ఉన్న జగన్ ని కలసి వైసీపీలో చేరిపోయారు. 2014లో కుమారుడికి టికెట్ తెచ్చుకున్నారు కానీ ఓటమి పాలు అయ్యారు. ఇక అక్కడే ఉన్నా బాగుండేది. కానీ నిలకడ లేని రాజకీయం తో వైసీపీని వీడి బయటకు వచ్చారు మళ్ళీ టీడీపీలో చేరేందుకు చూశారు.తీరా 2019 ఎన్నికల వేళ వైసీపీ వేవ్ చూసి అందులో మరోసారి చేరారు. కానీ ఈసారి జగన్ టికెట్ ఇవ్వలేదు. అంతే కాదు పార్టీ అధికారంలోకి వచ్చినా అయిదేళ్ళ పాటు ఏ నామినేటెడ్ పదవినీ ఇవ్వలేదు. దాంతో తీవ్ర ఆగ్రహం అసంతృప్తితో ఆయన 2024 ఎన్నికల ముందు సొంత గూటికి చేరుకుని టీడీపీ మెంబర్ అయ్యారు.ఆనాడు ఆయన తన కుమారుడికి అనకాపల్లి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు అని అంటారు. అది దక్కలేదు అయితే గడచిన ఎనిమిది నెలలలో అనేక నామినేటెడ్ పదవుల పందేరం సాగినా ఆయనకు కానీ కుమారుడికి కానీ అవకాశం దక్కలేదు. దాంతో ఆయనలో మళ్ళీ అసంతృప్తి రాజుకుంటోందని అంటున్నారు.2012 నుంచి అటూ ఇటూ పార్టీలు మారుస్తూ రాజకీయంగా నిలకడ లేకుండా పోవడం వల్లనే ఆయనకు ఈ విధంగా జరుగుతోంది అని అంటున్నారు. దాడి 2012లో టీడీపీని వదిలేశారు అలా అనకాపల్లి రాజకీయాల్లోకి కొత్త వారు వచ్చేశారు.

# వంశీతోనే అయిపోలేదా? ఇంకా అరెస్టులు ఉంటాయా?



అమరావతి,అన్యాయమని వైసీపీ..తగిన శాస్తి జరిగిందని టీడీపీ..విమర్శకు ప్రతి విమర్శలతో వల్లభనేని వంశీ అరెస్ట్ సెంట్రిక్‌గా పొలిటికల్ హీట్ పెంచుతున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో వైసీపీ అధినేత జగన్ విజయవాడ సబ్ జైలులో వంశీని ములాఖత్ అయి పరామర్శించారు. ఇదంతా ఒక ఎపిసోడ్ అయితే..మీడియా అడ్రస్ చేస్తున్న క్రమంలో జగన్ మాట్లాడిన మాటలు చర్చనీయాంశం అవుతున్నాయి.ఇప్పుడు వంశీని అరెస్ట్ చేశారు..రేపోమాపో దేవినేని అవినాశ్, కొడాలి నానిని కూడా ఇబ్బందిపెట్టొచ్చన్న ఆయన..దేనికీ భయపడేది లేదన్నట్లుగా చెప్పుకొచ్చారు. జగన్ మీడియాతో మాట్లాడుతున్నప్పుడు వెనకాల కొడాలి నాని, పక్కన పేర్నినాని..ఆ పక్కన దేవినేని అవినాశ్ ఆయన వెంటే ఉన్నారు. వంశీని పరామర్శించి..ఆయనపై నమోదైన కేసులు అక్రమమని చెప్పే క్రమంలో జగన్ ఎందుకు వీళ్లందరి పేర్లు తీసినట్లు అన్నదే హాట్ టాపిక్ అవుతోంది.వంశీ అరెస్ట్ తర్వాత ఏపీ పాలిటిక్స్‌లో మరోసారి పీక్‌లెవల్ హీట్ క్రియేట్ అయింది. ఇక నెక్ట్స్ కొడాలి నేని, రోజా, అంబటి రాంబాబు, పేర్నినాని, దేవినేని అవినాశ్ లాంటి వాళ్లను అరెస్ట్ చేస్తారంటూ ప్రచారం జరిగింది. కొందరు టీడీపీ నేతలు అయితే ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఓపెన్‌గానే స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అయితే ఇప్పుడు ప్రతిపక్ష వైసీపీ కూడా ఇదే మాట అంటోంది.తమ సొంత పార్టీ నేతలు మరికొందరు అరెస్ట్ కావొచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు నేతలు. వైసీపీ అధినేత జగన్ కూడా మీడియాకు ఇదే విషయాన్ని చెప్పారు. ఇప్పుడు వంశీ అరెస్ట్ కావొచ్చు..రేపోమాపో కొడాలి నాని, దేవినేని అవినాశ్‌ను కూడా ఇబ్బంది పెట్టొచ్చని..అన్నింటినీ చట్టబద్ధంగా ఎదుర్కొంటామని చెప్పుకొచ్చారు జగన్.

నెక్ట్స్ అరెస్ట్ వాళ్లదే?

అయితే నెక్ట్స్ అరెస్ట్ వాళ్లదే అని ప్రచారం జరుగుతున్న వేళ..ఆ ఇద్దరు, ముగ్గురు నేతలు జగన్ వెంట..వంశీ ములాఖత్ సందర్భంగా కనిపించడం మాత్రం హాట్ టాపిక్‌గా మారింది. అంటే కొడాలి నాని, దేవినేని అవినాశ్, పేర్నినాని కూడా త్వరలో అరెస్ట్ అవుతారని వైసీపీ అధినేత కూడా ఫిక్స్ అయిపోయారా అన్న చర్చ జరుగుతోంది. తమ పార్టీ నేతలు తప్పుచేయలేదని కవర్ డ్రైవర్ చేసుకుంటున్నప్పటికీ..అసలు మ్యాటరేంటో తెలిసే జగన్ అలా మాట్లాడి ఉంటారన్న టాక్ కూడా వినిపిస్తోంది.ఆ ముగ్గురు నేతలు కూడా వంశీ తర్వాత తమ వంతేనని మెంటల్‌గా ఫిక్స్ అయిపోయినట్లుగానే కనిపిస్తోంది. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న నేతలు..ఇప్పుడు మీడియా ముందుకు వచ్చి..అరెస్ట్ చేస్తే చేసుకోమనండి అంటూ స్టేట్‌మెంట్లు ఇవ్వడం చూస్తుంటే..అరెస్టులకు, కేసులకు ప్రిపేర్ అయ్యే మాట్లాడుతున్నారన్న చర్చ కూడా సాగుతోంది.ఎలాగూ అరెస్ట్ చేస్తారని అలాంటప్పుడు భయపడి దాక్కున్నట్లు కాకుండా జనంలో ఉంటేనే ఎక్కువ మైలేజ్ వస్తుందని భావిస్తున్నారట. అంతేకాదు తమ జోలికి రాకముందే వాయిస్ రేజ్ చేస్తే ప్రభుత్వం కాస్త బ్యాక్ స్టెప్ వేయొచ్చన్న స్కెచ్ కూడా వస్తున్నారట. అందుకే నెక్ట్స్ అరెస్ట్ అయ్యేది వాళ్లే అంటూ ప్రచారం జరుగుతున్న నేతలంతా ఆల్ ఆఫ్ సడెన్‌గా యాక్టీవ్ అయినట్లు కనిపిస్తున్నారు. వంశీ ములాఖత్ కోసం వెళ్లిన పార్టీ అధినేత జగన్ వెంట కనిపించి..తామెక్కడికీ పారిపోలేదని చెప్పే ప్రయత్నం చేశారట.అయితే జగన్ మీడియాను అడ్రస్ చేస్తూ కొడాలి నాని, దేవినేని అవినాశ్ పేర్లను స్పష్టంగా ప్రస్తావించారు. ఆ ఇద్దరిని కూడా ఇబ్బందిపెట్టొచ్చని జగన్ స్టేట్‌మెంట్ ఇవ్వడం చూస్తుంటే..వైసీపీ అరెస్ట్‌లకు ప్రిపేర్ అయినట్లే కనిపిస్తోంది. పార్టీ తరఫున లీడర్లకు లీగల్ సపోర్ట్ కూడా ఇస్తున్నారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లైనా అరెస్టయ్యే నేతలకు అండగా నిలవాలని భావిస్తోందట వైసీపీ. అయితే జగన్ కామెంట్స్‌పై టీడీపీ మాత్రం తీవ్రస్థాయిలో మండిపడుతోంది.ఫాల్స్ కేసులు, ప్రజాస్వామ్యం అని మాట్లాడే అర్హత జగన్‌కు, వైసీపీ నేతలకు లేదంటున్నారు టీడీపీ నేతలు. చంద్రబాబు, లోకేశ్ కుటుంబాన్ని నోటికొచ్చినట్లు మాట్లాడిన వంశీని జగన్ వెనకేసుకురావడం..పోలీస్ అధికారులకు వార్నింగ్ ఇవ్వడం జగన్‌కే చెల్లిందంటున్నారు టీడీపీ నేతలు. వైసీపీ హయాంలో లాగా తాము అక్రమంగా నిర్బంధించి..టార్చర్ పెట్టడం లేదని..చట్టప్రకారమే అరెస్టులు, మిగతా ప్రాసెస్ అంతా జరిగిందని అంటున్నారు.

టీడీపీ అధిష్టానం మీద క్యాడర్ ప్రెజర్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వంశీ, కొడాలి నానిని అరెస్ట్ చేయాలంటూ..టీడీపీ అధిష్టానం మీద క్యాడర్ ప్రెజర్ ఉంది. ఈ క్రమంలోనే వల్లభనేని వంశీ అరెస్ట్ జరిగిపోయింది. ఇక నెక్ట్స్ కొడాలి నానినే అంటున్నారు. బయట జరుగుతున్న ప్రచారానికి, టీడీపీ నేతలు చెప్తున్న దానికి బలం చేకూర్చేలా జగన్ కూడా కామెంట్స్ చేశారు. చంద్రబాబు, లోకేశ్ కుటుంబాన్ని కొడాలి నాని నోటికొచ్చినట్లు తిట్టారని..వైజాగ్ లాంటి ప్లేస్‌లలో ఇప్పటికే ఆయనపై కేసులు నమోదయ్యాయి.ఇక టీడీపీ ఆఫీస్ మీద దాడి కేసులో దేవినేని అవినాశ్ కూడా అరెస్ట్ అవుతారన్న ప్రచారం జరుగుతోంది. ఇక పేర్నినాని బియ్యం స్కామ్ విషయంలో ఇప్పటికే అలిగేషన్స్ ఫేస్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎప్పుడు ఎవరి అరెస్ట్ చేస్తారోనన్న ఆందోళన అయితే వైసీపీలో కనిపిస్తోంది. పైకి మాత్రం నేతలంతా గంభీరంగా స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు.వంశీని అరెస్ట్ చేస్తే ఏమైంది..తమను అరెస్ట్ చేస్తే ఏమవుతుందని..భయపడేదేలే అన్నట్లుగా చెప్పుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో అరెస్టులపై ప్రభుత్వ పెద్దల అడుగులు ఎలా ఉండబోతున్నాయన్నదే చర్చనీయాంశంగా మారింది. ఇదే ఊపులో ఇంకా అరెస్టులు ఉంటాయా లేక..మూమెంట్ చూసి వంశీని అరెస్ట్ చేసినట్లు ఏ హడావుడి లేని టైమ్‌లో మిగతా వారిని కూడా లోపల ఏస్తారా అనేది ఉత్కంఠ రేపుతోంది. రాబోయే రోజుల్లో ఏం జరగబోతుందో చూడాలి మరి.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో బరిలో లేకున్నా అయోమయం లో బీఆర్ఎస్

హైదరాబాద్,రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో తమ పార్టీ ఇంకా బలంగానే ఉందని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మాత్రం దూరంగా ఉండిపోయింది. ఎప్పుడంటే అప్పుడు ఎన్నికలకు సిద్ధం అంటూ ప్రకటనలు అయితే చేస్తున్నారు కానీ ఎన్నికల బరిలోని దిగేందుకు మాత్రం సై అనడం లేదు. ఇప్పుడు తెలంగాణాలో జరుగుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉండడంతో.. ఆ పార్టీలోని నేతలు, కార్యకర్తలు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఎవరి గ్రూప్ పాలిటిక్స్ వాళ్లు చేసుకుంటూ.. తమ ప్రచారాలతో సామాన్య కార్యకర్తలకు పిచ్చెక్కిస్తున్నారు. ఎవరికి మద్ధతుగా నిలవాలో అధిష్టానం స్పష్టంగా చెప్పకపోవడం, జిల్లా స్థాయి నేతలూ ఒక మాట మీదకు రాలేకపోవడంతో.. తలా ఓ దిక్కులో ఇష్టారీతిన ప్రచారం చేసుకుంటున్నారు.ఎన్నికలు జరగనున్న జిల్లాల్లోని పార్టీ నేతలు గ్రూపులుగా విడిపోయారు. బయటా, సోషల్ మీడియా ద్వారా తమకిష్టం వచ్చిన నేతలకి మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. మరో వారం రోజులైతే ప్రచారం ముగియనుండగా, ఇప్పటికీ.. ఏ అభ్యర్థికి, ఏ ప్రాతిపదికన మద్దతు ఇవ్వాలనే విషయంలో స్పష్టత లేకుండా పోయింది. పైగా.. జిల్లా నేతల్లోనూ ఎవరి దారి వారిదే కావడంతో.. క్యాడర్ మిగతా పార్టీలు, నేతల వైపు ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లు వెళ్లిపోతున్నారు.కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాదు, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ పోటీలో నిలుచోలేదు. పలువురు బలమైన అభ్యర్థులు టికెట్ల కోసం ప్రయత్నించినా.. బీ-ఫాం ఎవ్వరికీ ఇవ్వలేదు. అప్పటి వరకు పార్టీ తరఫున పోటీలో నిలుచోవచ్చని కలలు కన్న అభ్యర్థులు పార్టీ అధిష్టానం తీరుతో అవ్వాక్కయ్యారు. జమిలి వస్తే మనమే గెలుస్తామని ఓ వైపు కేసీఆర్ అదరగొడుతుంటే.. పోటీలో నిలుచునేందుకు సిద్ధమని వస్తున్నా, వద్దని అంటుంటే ఏం అర్థం కాని పరిస్థితి. ఈ అయోమయం తాజాగా జిల్లాల్లో మద్ధతు ప్రకటించాల్సిన అభ్యర్థులు ఎవరు అనే వరకు కొనసాగుతూనే ఉంది.పార్టీ నుంచి టికెట్లు ఆశించి భంగ పడిన చాలా మంది మనస్థాపానికి గురయ్యారని చెబుతున్నారు. దాంతో పాటే ఏళ్లుగా పార్టీలో కష్టపడినా గుర్తింపు దక్కని, ఎలాంటి పదవులు లభించని చాలా మంది బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. అలాంటి వారిలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కీలక నేత, మాజీ మేయర్ రవీందర్ సింగ్ ఫార్వర్డ్ బ్లాగ్ పార్టీలో చేరిపోయారు. ఆయన ఇప్పటికీ ప్రచారంలో కేసీఆర్ ఫోటోను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడిన వ్యక్తి, తమ అధినేత ఫోటోతో ప్రచారంలో ఉన్నా కానీ.. బీఆర్ఎస్ శ్రేణులు మాత్రం రవీందర్ సింగ్ కు మద్ధతుగా రావడం లేదని టాక్ నడుస్తోంది. ఆయన మాత్రం కేడర్ అంతా తన వెనుకే ఉన్నారని చెబుతున్నారు. కానీ.. వాస్తవంలో మాత్రం పరిస్థితులు వేరుగా ఉన్నాయని చెబుతున్నారు.జిల్లా పార్టీ నేతలు సైతం ఎలాంటి స్పష్టమైన నిర్ణయం




తీసుకోకపోవడంతో.. పార్టీ జిల్లా నేతలు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కు మద్దతు ఇస్తున్నారంట. బహిరంగంగానే మద్ధతు ప్రకటనలు చేస్తున్న సదరు నేతలు.. సోషల్ మీడియా వేదికగానూ మద్ధతు ఇస్తున్నట్లు పోస్టర్లు క్రియేట్ చేసి ప్రచారం చేస్తున్నారు. తొలుత ప్రసన్న హరికృష్ణ కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించారు. అక్కడ నిరాదరణ ఎదురు కావడంతో బీఆర్ఎస్ కారు ఎక్కేందుకు సిద్ధమయ్యారు. కానీ.. అక్కడా అలాంటి పరిస్థితులే ఉన్నాయని తెలియడంతో చివర్లో బీఎస్పీ పార్టీ చెంతకు చేరి పదవిపై ఆశ పెట్టుకున్నారు. వీరిద్దరు బీఆర్ఎస్ పార్టీ అధినేతలు, కీలక నాయకుల మద్ధతు తమకే ఉందని ప్రచారం చేసుకుంటున్నారు. కానీ.. వాస్తవంలో మాత్రం క్షేత్రస్థాయి కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు ఎలాంటి సమాచారం లేదు.ఇప్పటికే.. వీరిద్దరు బలమైన సపోర్టు ఉన్న నేతలే కావడం, బీఆర్ఎస్ స్థానిక నేతల నుంచి కాస్త మద్ధతు అందుకుంటున్నట్లు చెబుతున్న నేపథ్యంలోనే మరో ఇండిపెండెంట్ అభ్యర్థి శేఖర్ రావు సైతం తనకు బీఆర్ఎస్ పార్టీ అండదండలున్నాయని చెబుతున్నారు. ఆ పార్టీ శ్రేణుల మద్ధతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది అభ్యర్థులు బీఅర్ఎస్ తమకే మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించినా కానీ.. అధిష్టానం మాత్రం సైలెంట్ గానే ఉంది. దీనితో బీఆర్ఎస్ శ్రేణులు ఇటు ప్రచారం చేయలేక, అటు బహిరంగంగా మద్దతు ఇవ్వలేక అయోమయానికి గురి అవుతున్నారు.ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో ఏదో ఒక అభ్యర్థికి మద్దతు ఇవ్వాలనే డిమాండ్ క్రమంగా ఆయా జిల్లాల్లో పెరుగుతుంది. అలా చేసి అభ్యర్థుల్ని గెలిపించుకోగలిగితే.. పార్టీ ఇంకా బలంగా ఉందనే సంకేతాలు రాష్ట్ర రాజకీయాల్లోకి వెళతాయని అంటున్నారు. కానీ.. అధిష్టానం పెద్దలు ఏం ఆలోచిస్తున్నారో తెలియన ఆయోమయ స్థితిలో జిల్లా క్యాడర్ కు పెద్ద సమస్యే వచ్చిపడినట్లుందంటున్నారు పార్టీ కార్యకర్తలు.

# అది నిరూపిస్తే సీఎం పదవికి రాజీనామా చేస్తా..

న్యూఢిల్లీ,బంగ్లాదేశ్ ఛాందసవాదులతో తనకు సంబంధం ఉన్నట్లు నిరూపిస్తే సీఎం పదవికి రాజీనామా చేస్తానని మమతా బెనర్జీ బీజేపీకి సవాల్ చేశారు. ఇటీవల కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనను 'మృత్యు కుంభ్' అంటూ వ్యాఖ్యానించారు.పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో ఉన్న ఛాందసవాదులతో తనకు సంబంధం ఉన్నట్లు నిరూపిస్తే తన సీఎం పదవికి రాజీనామా చేస్తానని బీజేపీ ఎమ్మెల్యేలకు సవాలు చేశారు. బంగ్లాదేశ్ ఛాంసవదులతో తాను చేతులు కలిపానని బీజేపీ ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తానని ధ్వజమెత్తారు. "బీజేపీ ఎమ్మెల్యేలు నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. విద్వేషాలు వ్యాప్తి చేసేందుకు, ప్రజలను విడగొట్టేందుకు వాక్ స్వాతంత్ర్యం పర్మిషన్ ఇవ్వదు. మతాన్ని బీజేపీ తన రాజకీయాల కోసం వాడుకుంటోంది. జాతీయ భద్రత లేదా విదేశాంగ విధానం అంశాల గురించి నేను మాట్లాడటం లేదు. కానీ.. అమెరికా నుంచి భారతీయ అక్రమ వలసదారులను గొలుసులతో కట్టి బంధించి వెనక్కి పంపడం నిజంగా సిగ్గుచేటు. అమెరికా నుంచి వాళ్లని తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రత్యేక విమానాలు పంపించాలని" అన్నారు.

'మృత్యు కుంభ్'...



మరోవైపు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు కూడా సరైన ప్లాన్ లేదంటూ విమర్శలు చేశారు. ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనను 'మృత్యు కుంభ్' అంటూ వ్యాఖ్యానించారు. అంతేకాదు కుంభమేళాకు వచ్చే వీఐపీలకు మాత్రమే ప్రత్యేక హక్కులు కల్పిస్తున్నారని, పేదలపై నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ విమర్శలు చేశారు. యూపీలో బీజేపీ సర్కార్.. దేశాన్ని విభజించడం కోసం మతాన్ని అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా ఇటీవల మౌని అమవాస్య సందర్భంగా మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో 30 మంది భక్తులు మృతి చెందడం సంచలనం రేపిన సంగతి తెలిసిందే.

# తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్.. పంటల రక్షణ కోసం కొత్త స్కీం..!



హైదరాబాద్,తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. పంటల రక్షణ కోసం కొత్త స్కీం తీసుకురానుంది. దీంతో పాటు.. రైతుల అవసరాలకు సంబంధించిన పరికరాలను అందించే యోచనలో సర్కార్ ఉన్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.అడవి జంతువులు, కోతుల నుండి పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ స్కీంను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అంతేకాకుండా.. పామాయిల్‌తో పాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పాటు.. రాష్ట్ర అవసరాలు తీర్చే విధంగా కూరగాయల సాగు పెంపునకు పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు.జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో ఆయిల్ పామ్ కర్మాగారం అందుబాటులోకి రానుందని.. మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. అలాగే.. మెకడమియా పంట సాగుకు అవసరమైన పరిస్థితులను.. అనువైన ప్రాంతాలను అధ్యయనం చేయాల్సిందిగా ఉద్యానశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రగతి చూపని ఆయిల్ పామ్ కంపెనీలపై చర్యలు ఆరంభించాలని.. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసినట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. రైతులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా రైతు భరోసా నిధులను విడుదల చేసిన సంగతి తెలిసిందే.. మొత్తం మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు రైతు భరోసా నిధులు జమ చేశారు. మొదటగా ఒక ఎకరం ఉన్నవారికి, మరోసారి రెండు ఎకరాలు ఉన్నవారికి, ఈనెల 12న మూడు ఎకరాల ఉన్న రైతుల అకౌంట్లో రైతు భరోసా నిధులను జమ చేసింది.

# భారత్‌లోకి టెస్లా ఆగమన సంకేతాలు





న్యూఢిల్లీ, భారత ఈవీ మార్కెట్‌లో ప్రవేశించాలని ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టెస్లా సంస్థ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో సిబ్బంది నియామకాలను ప్రారంభించింది. ఢిల్లీ, ముంబై నగరాల్లో వివిధ పోస్టుల్లో ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్టు లింక్డ్‌ఇన్ వేదికగా ప్రకటించింది. దీంతో టెస్లా రాక ఖాయమైంది. ఇటీవలే ప్రధాని మోడీ, ఎలన్ మస్క్ మధ్య చర్చలు సాగాయి. తరవాత ఈ ప్రకటన వెలువడింది. టెస్లా ప్రకటన ప్రకారం, సర్వీస్ టెక్నీషియన్, సలహాదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతోంది. మగిలిన పోస్టులకు నియామకాలు ముంబైలో చేపడుతోంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా అధినేత మోదీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టెస్లా భారత్‌లో నియామకాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. టెస్లా సంస్థ కొన్నేళ్లుగా భారత విపణిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. 40 వేల డాలర్లకు పైబడిన ఖరీదైన కార్లపై భారత్ ఇప్పటివరకూ 110 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని విధించింది. ఇటీవల దీన్ని 70 శాతానికి తగ్గించింది.భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ చైనాతో పోలిస్తే చిన్నదే అయినా టెస్లాకు ప్రస్తుత పరిస్థితుల్లో కీలకంగా మారింది. భారత్‌లో గతేడాది లక్ష యూనిట్ల విద్యుత్ కార్ల విక్రయం కాగా చైనాలో ఈ సంఖ్య ఏకంగా 11 మిలియన్లు. అయితే, దశాబ్దం తరువాత తొలిసారిగా టెస్లా కార్ల అమ్మకాలు తగ్గాయి. దీనికి చెక్ పెట్టేందుకు భారత మార్కెట్‌లో ఎంట్రీకి టెస్లా ప్రయత్నిస్తోందని సమాచారం. ఇటీవల డొనాల్ట్ ట్రంప్‌తో సమావేశం అనంతరం ప్రధాని మోదీ అమెరికాతో వాణిజ్యలోటుపై దృష్టి పెట్టేందుకు అంగీకరించారు. రక్షణ రంగ కొనుగోళ్ల పెంపు, ఎఫ్-35 యుద్ధ విమానాల డీల్ వంటివి తెరపైకి వచ్చాయి. ఇక ట్రంప్ కేబినెట్‌లో కీలకంగా మారిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. అయితే, మస్క్ వ్యక్తిగత హోదాలో మోదీని కలిశారా లేక అమెరికా ప్రభుత్వం తరుపున సమావేశమయ్యారా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు, ట్రంప్ ప్రభుత్వంలో మస్క్‌కు ప్రాధాన్యం పెరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ, ప్రభుత్వ అవసరాల మధ్య సరిహద్దు రేఖ చెరిగిపోతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవలే ఇటలీ ప్రభుత్వ కమ్యూనికేషన్ కోసం స్పేస్ఎక్స్ సేవలు వినియోగించు కునేందుకు చర్చలు జరుగుతున్నట్టు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. డొనాల్డ్ ట్రంప్‌తో ఇటలీ ప్రధాని సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

### పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం

ఏలూరు,ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రులు ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపించాలని కోరుతూ సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు అండగా వుండే అభ్యర్థి, నిరుద్యోగ యువతి యువకుల

# నాగబాబు కోసం బీజేపీ త్యాగం ?

అమరావతి,బీజేపీ ఏపీ రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషిస్తోంది అన్నది తెలిసిందే. బీజేపీకి ఉన్న సీట్లు ఎనిమిది మాత్రమే. కానీ బీజేపీ జాతీయ స్థాయిలో అధికారంలో ఉంది. అంతే కాదు ఆ పార్టీ వరుసగా దేశంలోని అన్ని రాష్ట్రాలను గెలుచుకుంటూ అత్యంత బలమైన పొజిషన్ లో ఉంది. దాంతో కూటమిలో బీజేపీ మాట చెల్లుబాటు అవుతోంది అని అంటున్నారు.ఇదిలా ఉంటే ఏపీలో ఒక రాజ్యసభ సీటు ఖాళీ అయింది. గత నెలలో వైసీపీ ఎంపీ వి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా చేయడం వెనక బీజేపీ పెద్దలు ఉన్నారని ప్రచారం సాగింది. పైగా రాజ్యసభలో బీజేపీకి ఎంపీల అవసరం ఉంది. దాంతో బలం పెంచుకోవాలని బీజేపీ చూస్తోంది. ఈ విధమైన ఎత్తుగడలలో భాగంగానే విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు అన్న చర్చ అయితే సాగింది. ఈ నేపథ్యంలో బీజేపీకే ఈ ఖాళీ అయిన రాజ్యసభ సీటు వెళ్తుంది అని మొదట్లో గట్టి ప్రచారం సాగింది. అది కూడా మాజీ సీఎం గా ఉన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి ఇస్తారని కూడా ఊహాగానాలు వినిపించాయి. ఒక దశలో మెగాస్టార్ చిరంజీవిని మళ్ళీ పొలిటికల్ గా రీ ఎంట్రీ చేయించి ఆయనకు ఇస్తారని కూడా ప్రచారం సాగింది. కానీ ఈ మధ్యనే చిరంజీవి ఈ జన్మలో మళ్ళీ రాజకీయాల్లోకి రాను అని స్పష్టం చేశారు.అంతే కాదు తనకు బదులుగా తమ సోదరుడు పవన్ కళ్యాణ్ తన ఆశయాలను రాజకీయాల్లో నెరవేరుస్తారు అని కూడా చెప్పారు. దాంతో బీజేపీ మెగాస్టార్ మీద ఏమైనా ఆశలు పెట్టుకుంటే అవి కావు కుదరవు అని కచ్చితంగా రూఢీ అయినట్లు అయింది. ఈ నేపథ్యంలో బీజేపీకి నల్లారి ఒక ఆప్షన్ గా ఉంది.అయితే బీజేపీకి మంచి మిత్రుడిగా ఉన్న జనసేన ఈ సీటు కోరుతోంది. పైగా మెగా ఫ్యామిలీకే ఆ సీటు అడుగుతోంది అని అంటున్నారు. మెగా బ్రదర్ నాగబాబు రాజ్యసభకు వెళ్ళేందుకు మార్గం సుగమం చేయాలని బీజేపీ పెద్దలను కూటమి మిత్రులు కోరుతున్నారని తెలుస్తోంది. ఏపీ నుంచి ఇప్పటికి మూడు ఖాళీలలో టీడీపీ నుంచి ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు రాజ్యసభకు వెళ్ళారు.మరి కీలకమైన మరో మిత్రుడిగా జనసేనకు ఈసారి ఆఫర్ ఇవ్వడం న్యాయం ధర్మం అని కూడా అంటున్నారు. పైగా నాగబాబు ఆయన పార్టీ జనసేన ఇప్పటికే బీజేపీకి అనకాపల్లి ఎంపీ సీటు త్యాగం చేశారు. ఇలా ఏ విధంగా చూసుకున్నా నాగబాబుకే ఈ రాజ్యసభ కట్టబెట్టడం కూటమి ధర్మంగా కనిపిస్తోంది అని అంటున్నారు.కళ్ళు మూసుకుంటే మరో పదిహేను నెలలలో అంటే 2026 జూన్ లో ఏపీ నుంచి నాలుగు



రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతాయి అందులో నుంచి బీజేపీ తన వాటా తీసుకోవచ్చు అని అంటున్నారు. దీంతో బీజేపీ పెద్దలు కూడా పునరాలోచనలో పడ్డారు అని అంటున్నారు. నాగబాబుకే ఈ సీటు ఇచ్చేందుకు అయితే సూత్రప్రాయంగా అంగీకారం కుదిరింది అని అంటున్నారు.మరో వైపు నాగబాబు కూడా రాజ్యసభకు వెళ్ళేందుకే ఆసక్తిని చూపిస్తున్నారు అని అంటున్నారు. 2028 జూన్ దాకా పదవీ కాలం ఉన్న ఈ ఎంపీ సీటును ఆయన బలంగా ఆశిస్తున్నారు అని అంటున్నారు. నాగబాబుని మంత్రిగా తీసుకుంటామని చంద్రబాబు ఆ మధ్య ప్రకటన చేసినా అది ఇపుడు అంత తొందరగా అయ్యే వ్యవహారంగా లేదని అంటున్నారు. కేవలం నాగబాబు కోసమే మంత్రి వర్గంలో మార్పులు చేయలేరని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి ఇంకా ఏడాది కూడా కాలేదని అందువల్ల ఇప్పట్లో మంత్రివర్గంలో చేరికలు అయినా మార్పులు అయినా ఉండవని అంటున్నారు.అలా చూసుకుంటే నాగబాబుకు ఏ పదవీ దక్కక అన్యాయమే జరుగుతుందని అందుకే ఆయనను ఖాళీగా ఉన్న రాజ్యసభ సీటుని ఇచ్చి పెద్దల సభకు పంపించాలన్నదే తెలుగుదేశం అభిమతమని అంటున్నారు. పవన్ కూడా జాతీయ రాజకీయాల్లో తన సోదరుడు ఉండాలని బలంగా కోరుకుంటున్నారు. రేపటి రోజున కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరిగితే కచ్చితంగా నాగబాబుకు పదవి దక్కుతుందని కూడా అంటున్నారు. మొత్తానికి చూస్తే బీజేపీ త్యాగం చేసి నాగబాబుకు ఈ సీటుని ఇస్తోంది అని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో వాస్తవం ఎంత అన్నది చూడాల్సి ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com